
# ఐక్య ఉపాధ్యాయ

UTF

సంపుటి 2 ★ సంచిక 2 ఫిబ్రవరి 1976




వచ్చి విజం

పెన్షనూ... గ్రాట్యుటీ
ఉపన్యాసాల్లో మాత్రం
రిటైరైన
ఆరుమాసాల్లోనే!

రెడ్ టేపిజం....
లంచగొండితనం
పేరుకొన్న
యంత్రాంగంలో
వచ్చేదిమాత్రం....
చచ్చింతర్వాతే,

రు. 1

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక
*The Largest Circulated Telugu Educational Monthly*

# పాఠకుల అభిప్రాయాలు

జన్మదిన సంచిక ముఖచిత్రం; మనమూ మన ఆరోగ్యం శీర్షిక పాఠకులకు ఎంతో మేలు చేకూర్చాయి.

కడలి రామమోహనరావు, మొగల్తూరు.

జన్మదిన సంచిక ముఖచిత్రం, వ్యాఖ్య పత్రిక ప్రగతికి చిహ్నం, వినోదాత్మక సమగ్ర విషయప్రణాళిక చాల బాగుంది రచయితకు అభినందనలు.

జి.ఎన్. ప్రసాదరావు, పాలకొల్లు.

జన్మదిన సంచిక సంపాదకీయం, అందరికి కనువిప్పు కాగలదు. ప్రతి శీర్షిక ఎంతో ఉపయోగకరంగా వున్నాయి. లేఖలు తప్పక ఉండేలా చూడండి.

సి. హెచ్. రోశయ్య, లింగగూడెం.

పత్రిక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ వున్నాము. జన్మదిన సంచిక క్రొత్తగా ప్రవేశపెట్టబడిన శీర్షికలతో ఆకర్షణీయంగా వుంది. అయితే అచ్చు తప్పులు లేకుండా చూడాలి.

ఎ. లెనోరా, అమలాపురం

జన్మదిన సంచిక చదవటానికి చాల ఆసక్తిగా వుంది. ముఖచిత్రం, వ్యాఖ్య, జగన్నాథంగారి మూల్యాంకన చాలా బాగున్నాయి. మీసాలవీర్రాజు గురించి ఎదురు చూస్తున్నాం.

యస్. వి భీమవరం

దోపిడి న్యాయంలో-దౌర్జన్య భయంలో ఆహుతికాయే అన్నల్లారా-అదిగో మన ఆశాకిరణం ఐక్య ఉపాధ్యాయ-చూపిస్తున్నది నవ మార్గం.

కృష్ణ, వరికుంటపాడు

ముఖచిత్రం, నేటి ఉపాధ్యాయుని వాస్తవస్థితిని వర్ణిస్తున్నది. చిత్రకారునికి నా ధన్యవాదములు.

యస్. సి. ఆర్ కుమార్, రమణక్కపేట

జన్మదినసంచిక బలేపసందుగావుంది. వినోదాత్మక ప్రణాళికచూసి తెగనవ్వుకొన్నా. నేను ఈ మధ్య అంతగా ఎప్పుడూ నవ్వలేదు.

కె. బ్రహ్మాజీరావు, రాజమండ్రి

ముఖచిత్రం, వినోదాత్మక ప్రణాళిక చాలబాగున్నాయి. ప్రతి జన్మదిన సంచిక యిలా వెలువడాలని కోరుతూ సంపాదక వర్గానికి అభినందనాలు తెల్పుచున్నాము.

వై. సత్యనారాయణ, యెర్రగుంట.

జన్మదిన సంచిక వివిధ శీర్షికలతో అపరిమితానందం కల్గించింది. "అభినవ నీతి చంద్రిక", 'వినోదాత్మక సమగ్ర విషయ విభాగ ప్రణాళిక" పత్రికకు ఉన్నతస్థాయిని కల్గించాయి.

పత్రిక రాక కోసం ఉపాధ్యాయులు ఎంతో ఆదుర్దాతో, పోష్టాఫీసులకు కూడ పరుగెత్తడం నాకు చాల ఆశ్చర్యం కల్గించింది. గేయాలు కుదించకుండా యుంటే బాగుంటుందేమో.

యమ్. జాన్‌శాస్త్రి బి ఏ, హెచ్.యమ్.

కార్యదర్శి, కేశవరం యంప్లాయీస్ యూనియన్, కేశవరం.

"జయం గేయం జన్మదిన సంచికకు హైలెట్ !"

నూరీదు, పెందుర్తి.

'గేయాల రెయింరధం బహుత్ అచ్ఛా !"

యస్. హెచ్. హుస్సేన్, డోన్.

జన్మదిన సంచిక ముఖచిత్రం, మనమూ మన ఆరోగ్యం ఆనందప్రదాయి. ప్రశ్నోత్తరాలు పెంచండి.

ఎ.వి. రత్నశర్మ, వెదురుపాక.

ఒక ఏడాదిలోనే యింత అభివృద్ధిని సాధించి, ఉపయోగకరమైన శీర్షికలతో నిర్వహించుచున్నందులకు ధన్యవాదాలు.

జి.ఎ. ఫిలిఫ్, పాలకొల్లు.

జన్మదిన సంచిక చూసి ముగ్దుడనైతిని, వినోదాత్మక ప్రణాళిక, ముఖచిత్రం గొప్పగా వున్నాయి. రచయితకు ధన్యవాదాలు.

యం.పి. మెయినుద్దీన్, లక్ష్మణేశ్వరం.

76 జనవరి సంచిక సర్వాంగ సుందరంగావుంది. అనుకున్న దానికన్న పత్రికను సర్వాంగ సుందరంగా నడుపుతున్నందులకు మెనీ మెనీ థ్యాంక్సు.

పి. లీలాకుమారి, శివరామ దుర్గాపురం.

జన్మదిన సంచిక అత్యంత ఆకర్షణీయముగా వుంది. ముఖచిత్రం, మనమూ మన ఆరోగ్యం ఉపయోగకరముగా వున్నాయి. యికముందు గుండెజబ్బు మొ॥ వాటి గురించి కూడా తెలియజేయకోరిక.

కె. జగన్నాధం. ఊటుకూరు

జనవరి సంచిక ముఖచిత్రం ఉపాధ్యాయుని స్థితికి అద్దం పట్టింది.

కె. చిన్నారావు, నెల్లిపాక

జన్మదినసంచిక ముఖచిత్రం, వ్యాఖ్యసందర్భోచితంగా వుంది.

కె. కోటేశ్వరరావు, బద్దెపూడి

జన్మదిన సంచిక ముఖచిత్రం, మనము-మన ఆరోగ్యం అభినవ నీతి చంద్రిక, గుసగుసలు పత్రికను ఆకర్షణీయంగా రూపొందించాయి.

యన్. ప్రభుదాసు. కురుగొండ

★

IUV01A110

IKYA UPADHYAYA
Life Subscription 116-00
Yearly ,, 10-00
Single Copy 1-00
Ikya Upadhyaya
Akulavari Street,
Vijayawada-2

# ఐక్య ఉపాధ్యాయ

సంపాదకవర్గం:
మైనేని వెంకటరత్నం
(ప్రధాన సంపాదకుడు)
నాదెళ్ళ సీతారామాచారి
కోడూరు నారాయణరావు
అప్పారి వెంకటస్వామి
మోతుకూరు నరహరి

సంపుటి 2 ఫిబ్రవరి 1976 సంచిక 2

## సంపాదకీయం

# నిర్బంధ రిటైర్‌మెంటు

అవినీతిపరుల్ని ఎక్కడున్నా ఏరివేయాల్సిందే!
అసమర్థుల్ని ఏపదవిలోఉన్నా తగ్గించాల్సిందే!
– కాని ఆ పేరుతో దురన్యాయంమాత్రం జరగకూడదు.
నిరపరాధులు మాత్రం బలిగాగూడదు.
అదీ మా నివేదన... అదీ మా ఆవేదన!

రాష్ట్రం నలుమూలలనుంచి మాకార్యాలయానికి ఎన్నో వార్తలు వస్తున్నాయి. ఎన్నో భయకంపిత స్వరాలు విన్పిస్తున్నాయి.

అవినీతి, అసమర్థతలపేరిట వందలాది ఉపాధ్యాయులు, వేలాది ఉద్యోగులు నిరాధారులౌతున్నారని...

కనీసం ముఖ్యమంత్రికిగాని, ట్రిబ్యునల్‌కుగాని విజ్ఞప్తులు చేసుకోవటానికైనా అవకాశంలేదని...

* * *

ఉపాధ్యాయుడు నిరంతరం విద్యార్థిగా తాను పఠించి, ఇతరులకు విజ్ఞానాన్ని పంచే బాధ్యతగలవ్యక్తి పదవీకాలం పెరిగినకొలదీ మరింతపండిన ప్రాపంచిక అనుభవం అతణ్ని పరిణితుణ్ని చేస్తుంది 25 ఏండ్ల సర్వీసు పూర్తయ్యేసరికి సామాన్యంగా టీచర్‌కు 45 సం॥ల వయః ప్రమాణంకూడా పూర్తిగాదు. నిబంధనల దృష్ట్యా చూచినా ఇదివరకెప్పుడూ రిటైర్‌మెంట్‌కు వయోపరిమితిదప్ప సర్వీసు పరిమితిలేనేలేదు. ప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్త ఫ్రాయిడ్ థీరీ ప్రకారం మానవుడు 40 సం.లు నిండిన తర్వాతే స్థిరచిత్తుడు... స్థితప్రజ్ఞుడుకాగలడు. ఆ ఉదాత్త లక్షణాలు మూర్తీభవించే దశలోనే సర్వీసుకు పనికిరావని బయటికి నెట్టడం ఏంభావ్యం? ఆస్తిలో కుటుంబంలో ఎవరూ ఎదిగిరారు. బిడ్డల విద్యాభ్యాసం పూర్తిగాదు. ఏ ఆధారమూ ఉండదు. ఎటుచూసినా దారితెన్నూలేని నిబిడాంధకారమే ఎదురౌతుంది. కుటుంబం ఆరోజునుండీ బజారుపాలు కాక తప్పదు. కాన విద్యారంగాన్ని నేడెదుర్కొంటున్న భయభ్రాంతుల్ని ప్రజాప్రయోజనాల దృష్టితోనే తొలగించాల్సి వుంది. ఆ విధమైన చర్చలు, ఆలోచనలు కొనసాగించాల్సి వుంది. తద్వారా నూటికి నూరుపాళ్ళు అక్షరాస్యతను సాధించాలనే ఆశయానికి దోహదం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

విద్యారంగంలో ప్రజ్ఞాపాటవాల్ని అభివృద్ధిచేయటానికి నిర్బంధ రిటైర్‌మెంటు మార్గంకాదు. మూలకారణాలైన భౌతిక వనరుల లేమిని పూర్చి ప్రస్తుతవలసపాలనావశేషమైన బానిస విద్యా వ్యవస్థ స్థానే శాస్త్రీయ విద్యా విధానాన్ని పని – అనుభవం జోడింపబడిన రీతిలో ప్రవేశపెట్టాలి. అందుకొఱకు జాతీయాదాయంలో కనీసం 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులను కేటాయించాలనే కొఠారి కమిషన్ సిఫార్సులను ఉపాధ్యాయ సంఘాలు సూచించిన సవరణలతో అమలు పఱచడమే సరయిన మార్గం.

ప్రజాస్వామ్య శాస్త్రీయ విద్యావిధానం కొఱకు, ఉపాధ్యాయుని కనీస జీవనాభివృద్ధికొరకు, ఆత్మగౌరవ రక్షణ కొరకు, అధికారుల అవినీతికి అక్రమాలకూ అనేక సంవత్సరాలుగా పోరాడుతూ ఉపాధ్యాయుల - విద్యార్థుల - తలిదండ్రుల ప్రేమాభిమానాలు పొందిన ఉద్యమ కార్యకర్తలు కొందరు కక్షాచర్యగా ఒక్క కలంపోటుతో రిటైర్‌గావింపబడిన సంఘటనలున్నాయ్. పట్టపగలు నడిబజారులో ఖూనీచేసిన వ్యక్తికిగూడ కోర్టులో వాదించుకొనే అవకాశం ఇచ్చిన ప్రభుత్వం, తనకు సుదీర్ఘకాలంగా సర్వీసుచేసిన ఉద్యోగికి చివరి దశలో కనీసం ట్రిబ్యునల్‌కుకూడా అప్పీలు చేసుకొనే అవకాశం నిరాకరింపబడటం కనీసమానవతను త్రోసిరాజనటమే అవుతుంది.

కాబట్టి ఇన్ని అనర్థాలకు, విద్యావ్యవస్థలో తీవ్ర అలజడికి కారణమైన నిర్బంధ రిటయిరుమెంటు ఉత్తర్వులను ప్రభుత్వంవెంటనే రద్దుచేయాలని, ఇంతవరకు నిర్బంధరిటయిరుమెంటు చేయబడినవారందరికి అపీలు చేసుకొనే అధికారం యిచ్చి, వారి కేసులు తిరిగి పరిశీలించి తగున్యాయం కల్గించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## జీవిత చందాలు చెల్లించినవారు

శ్రీ యస్. యం. కొండయ్య, మాచవరం, విజయవాడ, కృష్ణాజిల్లా

శ్రీ పి. వెంకటరావు, ఎ. సూరవరం, తుని.తూ.గో.జిల్లా

# కథలు గేయాలు

## అసలు చదువు

శ్రీ ఆర్. రామిరెడ్డి, మహబూబ్ నగర్.

పిల్లలు ... బడిపిల్లలూ!
కల్లకపటు మెరుగనట్టి
తెలతెల్లని మల్లెలూ!
మీరే రేపటి పౌరులు!
భావిదీర్పు భాగ్యసిరులు!
అందుకే....
అసలుసంగతి చెప్పేస్తాను వినండి!
నిసలుకథలు విప్పేస్తాను కనండి!

అక్కరకురాని పుక్కిటుపురాణాలే మీ పుస్తకాలనిండా!
రాజులసంగతితప్ప రంగప్పలసంగతి లేనేలేదు వాటిల్లో
బక్కచిక్కిన బడుగుజీవుల బాధామయగాధలే లేవు వాటిల్లో
సమాజంమార్పునుసూచించే సరియైనరీతులేలేవువాటిల్లో
అందుకే అన్నికుక్కమూతిపిందెలు కలనారికాలిఅందెలు!
కాగితాలను ఖరాబుచేస్తూ నీతులు ... గోతులు రోతలు!

* * *

ప్లీడరో ... లీడరో ... డాక్టరో ... కంట్రాక్టరో
ఎవరినైనా చూడండి పరీక్షగా
మెజారిటీ డబ్బుకు దాసులు!
నీతినిజాయితీలు చచ్చిన నీరసులు!
పాపం వీళ్ళదేముంది వీళ్ళననటానికి
నేర్పించిన విద్యావిధానంలోనేఉంది అలోటు!
అది పాపం మోసం టోపీ దగాల ఓల్లిబోటు!
ముంచటుంతప్ప తేల్చటం తెలీదు దానికి...
వంచనాశిల్పమే అసలు లక్షణం దానికి!
ఎవరినైనా అడగండి 'ఎందుకు చదువు?'
డబ్బుకోసం ... డబ్బుకోసం ... డబ్బుకోసం!
కట్నాలకోసం ... ఖరీదైన భోగలాలసతకోసం!'
—అయితే ఆ చదువు మాకొద్దనండి పిల్లలూ!
మల్లెలం ఉల్లులం కాబోమని చెప్పండి పిల్లలూ!
మమ్మల్ని చీపురుపుల్లల్లా చూడవద్దనండి పిల్లలూ!

* * *

'డబ్బులేనివాళ్లు డబ్బుకు కొరగార'నే నీతి
దబ్బునపోయి మోదంపొందాలి తమ్ముడూ!
'తినికూర్చోవటమే సుఖం' అనుకొనే పెరిగినబొజ్జలన్నీ
నుజ్జునుజ్జుగామారి స్వేదంగా మారాలి చెల్లెలా!
'అంతా మన ఖర్మ!' అనుకొనే అజ్ఞానం
అతిత్వరగా అంతరించాలి తమ్ముడూ!
'జీవితం బుడగ' 'మనం దేనికీ కర్తలం కాదనే'
పగటి మోసం పట్టు చెదరాలి చెల్లెలా!
ఇన్ని మాటలెందుకు? ఇంత ఘోష దేనికి?
'మా తాతల తండ్రుల శ్రమ ఫలితాన్ని
దోచేసిన దగాకోరుల మతలబుల
దాఖలాలు కితాబుల్లో ఎక్కడా
రాయలేదే'మని ఒక్క ప్రశ్న అడగండి పిల్లలూ...
ఒక్క ప్రశ్న అడగండి!
అది చాలు అసలు మోసం అర్థం గావటానికి!
అది చాలు కర్తవ్యపథం కన్పించటానికి;
అదే ప్రస్తుతం అవసరమనండి పిల్లలూ!
అందులోనే అసలు కిటుకు ఉన్నదనండి పిల్లలూ!
మనిషిని మనిషి దోపిడీ చేయని
నవ సమాజ నిర్మాణాన్ని చెప్పేదే అసలు విద్య!
సామాజిక న్యాయాన్ని సమకూర్చుతూ
సామాన్యుల్ని అసామాన్యుల్నిగా తయారు చేసేదే
నిసలైన విద్య!'

మినీకథ

## సంఘం చీటీ

పి. శ్రీరాములు, పొట్టిపాడు, గన్నవరం సమితి.

గొడ్లు హాయిగా మేస్తున్నయ్ బీట్లో
'తానాగొడ్డుపాటి కూడా చేయడు' ప్రొద్దుట ... బండ చాకిరీ చేసి ... పల్లె గడుక్కువచ్చి కూర్చుంటే బుగతమ్మ నీళ్ళుగారే పాసిపోయిన అన్నంపెట్టింది. గొడ్డుగారమేసింది. తినలేక కూర అడిగితే ... పులిసిన మజ్జిగకుండ నెత్తిమీద బోర్లించింది. 'చచ్చినాడా ... నువ్వు చేసే పాటుకు కూర గావాలా?' అని.

అది తల్చుకొంటూ తుమ్మచెట్టు నీడన చినుగు కండువా పరుచుకొని నిస్సత్తువగా పడుకొన్నాడు రామిగాడు. ఎంకడు కర్ర గెడ్డంకింద పోటీ పెట్టుకొని వాడు చెప్పింది విన్నాడు.

'రామిగా....!'

'ఏందిరా?'

'రేత్రికి మీటింగు కెల్దాంరా!'

'మానాన్న తంతడు!'

'ఏంటికిరా?'

'మా దొర సెప్పిండటు ... ఎల్లనీయొద్దని!'

'మా దొరా వద్దన్నడు! ఊళ్ళు మనకి సదువొద్దంట్రు, మీటింగొద్దంట్రు ... ఎందుకో? అయినా ఎల్దాము ... పని తెమిలాక ... అందరూ నిద్రోయినాక!'

ఇద్దరూ కూడబలుక్కొని పిల్లుల్లా మీటింగుకెళ్ళారు.

'మాదుగ్గర ఎవ్వరూఇయ్యరు. మనమేసాధించుకోవాలి! అందరూ చదువుకోవాల! అందుకు ఓ మార్గంసంఘం. మీరంతా సంఘంలో చేరండి!'

— ఆ బోధ విన్నతర్వాత మూలగా నక్కి కూర్చున్న

( మిగతా 3 వ పేజీలో )

సీరియల్ :

# అభినవ నీతిచంద్రిక

## 'రత్నం'

(మాజీచైర్మన్ మీసాల వీర్రాజుకు పదిమంది మనవలూ మనవరాళ్ళూ. వాళ్ళకు చదువు ఒంటబట్టటంలేదు. తానాశించినదానికి వ్యతిరేకంగా పెరుగుతున్నారు. వాళ్ళని దారికితేవాలని తపనపడి చివరికి విష్ణుశర్మను నియోగించాడు. అతను ఆ పిల్లల్తో కలిసిపోయి 'బ్రెయిన్‌వాష్' ప్రారంభించాడు. మొదటిగా 'మీసాలయ్య' కథచెప్పటం మొదలెట్టాడు ఇక చదవండి.)

వరంధామయ్య దర్జాగా ... ఠీవిగా ... కోరమీసం మెలేస్తూ ... పైపంచ మోకాళ్ళకూ నడుముకూ బిగించి ... లంకాకు చుట్టకాలుస్తూ ... వీధి అరుగుమీద జగ్గిగం వేసుక్కూర్చున్నాడు.

అంతలో ఓ భట్రాజు వచ్చి ఆయన మీసంమీద ఓ పద్యం చెప్పి ఓ పొగాకు కాడ పట్టుకుపోయాడు. అటూ ఇటూ కూర్చున్న పెద్దరెడ్డీ....రామానాయుడూ ఓ చిరునవ్వు చిలికించి తమ మీసాలమీదికి కూడా చేతులు పోనిచ్చారు.

'రొయ్యకు లేవా బారెడు ...?' అంటూ పద్యం గొణుక్కుంటున్న కొడుకును 'బిగ్గరగా చదవరా!' అని హెచ్చరించి కళ్ళల్లోకి పరిహాసం తెచ్చుకొంటూ రెడ్డివంకా......... నాయుడివంకా సాభిప్రాయంగా చూశాడు పరంధామయ్య.

'రొయ్యకు లేవా బారెడు......?' తండ్రి కేకతో గొంతు పైస్థాయికి పెంచాడు కొడుకు. 'హ్హా...హ్హా...హ్హా!' బొజ్జ ఊగిపోయేలా నవ్వాడు పరంధామయ్య

ఆ నవ్వు ముల్లు పోటులా తగిలి ఉడుక్కుపోయారు ఆ హంగుదార్లు. వాళ్ళకేమున్నయ్ మీసాలు తప్ప! డాబులకి దర్జాలకి వాళ్ళ ఆస్తు లెప్పుడో కరిగిపోయినయ్.

ఆస్తి ఉన్నదే... అది అహంకారాన్ని, అభిజాత్యాన్నీ తెచ్చి పెడుతుంది. అది పోయినా... నరనరాల్లో జీర్ణించిఉండే వాటి ఛాయలు మనిషిలో మిగిలే ఉంటాయి. ఉలికిపాటు తెచ్చి పెడుతుంటాయి.

బతికి చెడిన నాయుడికీ... రెడ్డికీ ఆ జబ్బే పట్టుకొంది

---

( 2 వ పేజీ తరువాయి)

ఆ యిద్దరికీ అప్పుడే కూడూ గుడ్డా దొరికినట్టు ... చదువు వచ్చేసినట్టు అన్పించింది.

పరిగలేరుకొని అమ్ముకొని దాచుకొన్న డబ్బులుతీసి సభ్యత్వం యిచ్చి సంఘంలో చేరారు.

ఆ చీటీలను ఆ యిద్దరూ ప్రాణంకంటె మిన్నగా చింకి చొక్కాల్లో దాచుకొన్నారు.

ఆ మార్నాడే 'మాకు సద్దన్నం వద్దు...బండతిట్లూవద్దు' ఓ ఊరేగింపు.

ఆ ఊరేగింపులో నిటారుగా నిలబడిన రామిగాడు ... ఎంకడు.

ప్రస్తుతం. వాళ్ళు ఆ అఘాతాన్నుండి తట్టుకొన్నారో లేదో ... అంతలో ...

దారినబోయే ఓ రైతు చుట్టుకున్న తలపాగా విప్పి 'దండాలు...దండాలు!' అంటూ సాగి వెళ్ళేడు.

చిఱునవ్వు నవ్వేడు పరంధామయ్య మీసం మీదికి చేయి పోనిచ్చి.

'రోజుల్లే ... ఏం చేస్తాం!' తమలో తాము గునుసుకొన్నారు రెడ్డీ...నాయుడూ.

ఇంకొకతను సైకిలు అంత దూరాన దిగి వాళ్ళముందుగా నడిపించుకుపోయాడు.

ఎండపొడకు మిలమిలా మెరిసింది పరంధామయ్య కోరమీసం.

కాని అచూవు...దానిలో అహం!

పెనంమీద వేయించినట్టయింది రెడ్డికీ...నాయుడికీ. వాళ్ళ మనసులు తేలుకొండెల్లా మారిపోయినయ్.

'సరేగాని బావా! ధర్మకర్తవుగదా...ఆగుడి అలాపాడు పడుతుంటే చూస్తూకూర్చున్నావేం?' —అన్నాడు నాయుడు లౌక్యమంతా ఉపయోగించి.

"ఊళ్ళో స్కూలు పెట్టుకుందామంటే జీతగాళ్ళు దొరకరని వద్దన్నావటగా!' తన శ్రుతి కలిపాడు రెడ్డి.

"ఇంకేం కానీయండి...పెద్దలున్నారుగా!"

మళ్ళీ ఎద్దేవా!

మండింది వాళ్ళకి. కాని యేంచేస్తారువాళ్లు? కోరలు తీసిన పాములయిరి!

అంతలో ఎదురుగా గుడిఆవరణలో చీట్లపేక ఆడుతున్న వాళ్లు ఎందుకో తగాదాలాడుకోవటం మొదలెట్టేరు. గుడి వెనకవున్న రంగి గుడిసెలో అప్పుడే పూటుగా సారాతాగి వచ్చిన గొల్లసుబ్బడు 'ఊరుకోండిరా అవతల పెద్దమనుసులున్నారు!' అంటూ సర్దడం మొదలెట్టేడు.

మళ్ళీ సద్దుమణిగింది. రమ్మీ ఆట రమ్ములో పడింది.

వాళ్ళంతా పరంధామయ్యకు బాకీదారులే. తాకట్టులుంచీ, నోట్లువ్రాసీ అప్పులు పట్టుకుపోయినవాళ్ళే. వాళ్లుచెడిపోయినకొద్దీ పరంధామయ్య ఆస్తిపెరుగుతూనేవుంది. మీసం మెలిదిరుగుతూనే ఉంది. కొసలుదేలి మెరుస్తూనే ఉంది.

'చూశావా బావా! లోకం ఎలా పాడవుతున్నదో?' అన్నాడు నాయుడు 'నీమూలానే' అనే భావం కళ్ళల్లో ప్రతిఫలింపజేస్తూ.

'ఈజూదాలూ, తాగుళ్ళూ మాన్పకపోతే ఊరేంబాగుపడుతుంది?' రెడ్డికూడా దానికే తాళంవేశాడు.

'ఎప్పణ్ణుంచియీబుద్ధి?' ఎత్తిపొడిచాడు పరంధామయ్య.

నోరెత్తలేదు రెడ్డీ...నాయుడూ.

లోలోపల మాత్రం కసి...విషం!

*  *  *

ఊళ్ళో యువజనసంఘంవెలిసింది. గ్రంథాలయమనీ... రాత్రి పాఠశాలలనీ...పాటలనీ...ఆటలనీ చైతన్యం మెల్లగా ఆవరించింది.

'సంక్రాంతి' సందర్భంలో జరిగిన ఆటల పోటీలు...

వైజ్ఞానిక ప్రదర్శనలు ఊరిని మరో దారికి మళ్ళించినయ్.

కోడిపందేలూ... జూదాలూ మానేసి జనం అటువైపు మూగటం మొదలెట్టారు.

అది చూసి అదిరిపడ్డాడు పరంధామయ్య.

ఆఖరికి కూలి నాలి జనం కట్టుగట్టి నాములూ... ... ... అప్పులూ వద్దని అధికకూలీ కావాలని ఆందోళన మొదలెట్టేరు.

పునాది కదులుతున్నట్టు గ్రహించాడు ఆ పెత్తందారు. ఊళ్ళో దాన్ని సూచించే మార్పులు కూడా కన్పించినయ్. ఓ రైతు తలగుడ్డ విప్పకుండానే తన ముందుగా నడిచి పోయాడు. సైకిల్ దిగకుండానే మరో యువకుడు సాగి పోయాడు. కిర్రు చెప్పులు విడువకుండానే ఇంకో గొల్లవాటిని మోగించుకొంటూ వెళ్ళిపోయాడు. గుళ్ళో చీట్లపేక జనం పల్చబడింది. రంగి వ్యాపారం వెనకబడింది. రెడ్డి... నాయుడూ అరుగుమీదికి రావటం మానేశారు.

అది చూసి గంగవెర్రు లెత్తిపోయాడు పరంధామయ్య. అగ్గి గుగ్గిలమై పోయాడు పళ్లు పటపటా నూరేడు.

ఆ ఆవేశంలో నాలుక కొరుక్కున్నాడు కూడా.

పగబట్టిన త్రాచుకు నిద్రాహారాలుండవట! తన తోక తానే కొరుక్కుంటుందట! కన్పించిన గడ్డిపోచనల్లా కాటేస్తూ పోతుందట!

ఓ అర్ధరాత్రి గ్రంధాలయమున్న పూరిపాక తగలడి పోయింది.

రాత్రిపాఠశాల నడిపి ఒంటరిగా వస్తున్న యువజన నాయకుడి బుర్ర పగిలింది.

కూలిపేటకు నిప్పు అంటుకొంది.

వాళ్ళంతా కుయ్యో... మొర్రో అంటూ పరంధామయ్య దగ్గరికే పరుగెత్తుకు వచ్చారు ... మొఱ పెట్టుకోటానికి.

'ఒరే ... ఊరికి కీడుమూడిందిరా ... అసలు భయం భక్తి లేకపోతే ... విపరీతాలు పుట్టమంటే పుట్టవూ? ఏడవండి మరి!' అంటూ ఏలుముద్దర్లేయించుకొని తలో వందా అప్పు లిచ్చాడు పరంధామయ్య.

రెడ్డి ... నాయుడూ ఊరుకొంటేగా?

'ఇదంతా పరంధామయ్య మాయాజాలం!' రెచ్చగొట్టాడు రెడ్డి.

'వాళ్ల జీతగాడితోనేగా యీ దారుణమంతా చేయించింది!'

—అసలు రహస్యం బయటపెట్టాడు నాయుడు.

మొట్టమొదట అనుమానంగా జూశారు వాళ్ళవైపు జనం.

'మొన్నమొన్నటిదాకా పరంధామయ్యతో కలసి వీళ్లూ ఊరిమీద పెత్తనం చేసినవాళ్లే! అతనిగోచి పెట్టుకుని దిరిగే వాళ్లే! పెద్ద పెద్ద వాళ్ళు నాలుకలు ఎలాగైనా మార్చగలరు! మనకెందుకొచ్చిన తంటా?'—

కాని ఆ ప్రచారంతో ఊరి వాతావరణం మాత్రం మారింది.

ఆ దుర్మార్గానికి కారణం పరంధామయ్యేనని అందరి మనసుల్లోనూ నాటుకొంది.

అది గ్రహించాడు పరంధామయ్య.

ఆలోచనలో పడ్డాడు పరంధామయ్య.

బుర్రలో ఏదో తళుక్కుమంది.

వెంటనే ఆరాత్రికి రాత్రి నాగాచారికి కబురుచేశాడు.

ఎత్తు ... ఎత్తుకుపైఎత్తు ... జనాభిప్రాయాన్ని మరో వైపుకు మళ్ళించే ఎత్తు!

* * *

ఉన్నట్టుండి నాగాచారికి గణంపూనింది గుడిముందు.

ఆ పూనకంలో 'ఊరికి చెడురోజులొచ్చాయిరా. జనం పాపం పెరిగిందిరా. ఓం ఓం అదిగో ఓం కాషాయజెండా ... అదుగో పరబ్రహ్మం!'

పరంధామయ్య గోచిఊడిపోయేట్టు పరుగెత్తేడు ఆగుంపులోకి 'ఏమిటేమిటి?' అంటూ. నాగాచారి ఊగిపోతున్నాడు ఓంకార ప్రళయమేఘ గర్జారావంతో.

గుగ్గిలంపొగతో వాతావరణమంతా నిండింది. వేపమండలతో విసురుతున్నారు కొందరు జనంలో అదో మత్తు, అదో ఆందోళన, అదో కలవరం! అదో భీతి!

ఆ మర్నాడే నిర్ణయమయింది. ఊరివెలుపల ఉత్తరంగా బ్రహ్మంగారి జెండా పాతాలని, ఊరికిపట్టిన అరిష్టాన్ని తొలగించాలని.

'బ్రహ్మంగారి జెండా ఓం కాషాయజెండా!'

ఊరిచూపంతా ఒక్కసారి అటువైపు తిరిగింది.

'మళ్ళీ ఆదోకథ, జెండాకథ. రేపుచెప్తాను!' పిల్లల్ని సస్పెన్స్‌లో పెట్టి ఆరోజు కథముగించాడు విష్ణుశర్మ.

(సశేషం)

నవభారత్ ఫ్యాన్సీ అండ్ బుక్ స్టాల్
మెయిన్‌రోడ్డు, గన్నవరం.
కృష్ణా జిల్లా.
కాలేజీ, హైస్కూలు, ప్రాధమిక తరగతుల పాఠ్య గ్రంథములు మరియు స్టేషనరీ సరసమైన ధరలకు లభించును.
ప్రొ॥ యమ్. యజ్ఞనారాయణ

శుచికి! రుచికి!!
హోటల్ విజయ
కాఫీ అండ్ భోజన హొటల్స్
ఫోన్ : 66
గన్నవరం, కృష్ణాజిల్లా.
టీ పార్టీలకు, డిన్నర్లకు మా ప్రత్యేకత.
ప్రొ॥ చంటి బ్రదర్స్

వ్యంగ్య రచన

# ఆం. ప్ర. ఫేషన్ నూతన కౌన్సిల్

## తేగలసమితి, మురికివాడ, బుర్రగుంజు
## యు. పి. స్కూలులో

తేదీ 1-1-76.

— 'డబులెమ్మె'

ఫేషన్ నూతన కౌన్సిల్ సమావేశం 1-1-76 న శ్రీ ముప్పతిప్పల ముకుందరావుగారి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నానాబాధల నాగేంద్రశర్మగారు కూడా హాజరయ్యారు. అధ్యక్షులు సభ్యులకు నూతన వత్సర శుభాకాంక్షలందిస్తూ మొన్నటి పే ఫిక్సేషన్ పైరవీ వసూళ్ళ కార్యక్రమంలో మన ఆఫీసు బేరర్స్ అగ్రగాములుగా ఉన్నందుకు ముందుగా నా ధన్యవాదాలు. వారంతా సరికొత్త సూట్సు ధరించి ఈ సమావేశానికి నిండుగా హాజరైనట్టు ఈ నూతన సంవత్సరంలో కూడా అలాగే కళకళగా ఉంటారనీ, పైరవీ వసూళ్ళ కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్విరామంగా కొనసాగిస్తారని ఆశిస్తూ దీనికి తోడ్పడగలందులకు ఆ భగవంతుణ్ణి వేనోళ్ళ ప్రార్థిస్తున్నాను. దానికి అనువైన పరిస్థితులు కూడా ప్రస్తుతం ఏర్పడ్డాయి. అడక్కుండానే అందరికీ అమాంతంగా డి. ఏ. పెరిగింది. కాన యీసారి రేటు పెంచి 25% వసూలు చేయాలని నేను అభిప్రాయపడుతున్నాను. ఎందుచేతనంటే మన సమితి విద్యాశాఖ సిబ్బంది వెనుకటిలా 10% కు సుముఖంగా లేదు. బజారులో ధరలు మండిపోతున్నాయనీ, వెధవ వంకాయ ఒకటికి పదిపైసలు, ఎండుమిర్చి ఒకటికి 5 పైసలు ఏదికావాలన్నా కొరివిగా తయారౌతున్నదనీ, 10% గిట్టుబాటుగా ఉండదనీ చాలా బాధగా కోపోద్రిక్తంగా ఉన్నారు. అందువలన వాళ్ళకి 15% అయినా ముట్టజెప్పాలి. మిగిలిన 10% మీకు తెలిసిందేగా! (ఆహ్హా హ్హా సభలో నవ్వులు)

మరో ముఖ్యవిషయం ఈ యు. టి. ఎఫ్. వాళ్ళున్నారే మహా ప్రమాదంగా తయారయ్యారు. ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల్లో వ్యాపించి మహా వటవృక్షంగా పాతుకుపోతున్నారు. వాళ్లని మొగ్గలోనే తుంచివేయాలనే మన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. పోనీ మనమే కాదు. 'బడాయి' సంఘం వాళ్లుగాని, 'వీరుల' సంఘంవాళ్ళుగాని ఎవరూ ఏమీ చేయలేకపోయారు. కాన ఆ మహాప్రమాదాన్ని ఏవిధంగానైనా మనం కలిసికట్టుగా ఎదుర్కోవాలి. ఇప్పుడు మన సమితి ప్రధాన కార్యదర్శి పెద్దకడుపు పరమేశ్వరరావు తన నివేదిక ప్రవేశపెడతారు.

కార్యదర్శి నివేదిక :- అధ్యక్షా! పైరవీ కార్యక్రమాఖండ మహోజ్వల చరిత్రులారా! అందరికీ నా వందనాలు. ఈనాడు శుభదినం. ఎందుకంటే సమావేశం చివర ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ నూతన సంవత్సరంలో కూడా ఎప్పటిలా నన్నే సమితి శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొంటారని నాకు తెలుసు (ఆహ్హాహ - సభలో నవ్వులు) నవ్వుపూర్వకంగా మీ ఆమోదాన్ని తెలియజేస్తున్నందుకు మీకందరికీ ఎంతో కృతజ్ఞుణ్ని! సరే ... ఈనాడు జాతీయంగా అంతర్జాతీయంగా ఏవేవో గొడవలు జరుగుతున్నాయ్. అవన్నీ మనకనవసరం. 'కడుపే కైలాసమ'న్న మన మూలసిద్ధాంతానికి అది విరుద్ధం. ఎవడెట్లా చచ్చినా ఫరవాలేదు. మనంమాత్రం పచ్చగా ఉన్నామా లేదా అనేదే ముఖ్యం. మనం గత సంవత్సరంలో ఎన్నో వసూళ్ళ కార్యక్రమాలు దిగ్విజయం చేశాం. 24% డి ఏ. పెంపుదలలో, ఇంక్రిమెంట్లు శాంక్షన్‌లో ఎరియర్స్ ఇప్పించుటలో, రీఫిక్సేషన్‌లో, యి. ఓ. గారి సత్యనారాయణవ్రత సందర్భంలో, వారి అబ్బాయి అన్నప్రాసమహోత్సవంలో, జె. డి. ఐ. గారి పుత్రరత్న జన్మదినోత్సవంలో, డి. ఐ. గారి రోగోత్సవంలో ... గుమాస్తా (ఎడ్యు) గారి ప్రథమభార్య మరణోత్సవంలో, తిరిగి ద్వితీయ వివాహమహోత్సవంలో ... డి. ఎ. మెర్జ్‌డ్ స్కేల్సు ఫిక్సేషన్ సందర్భంలో అన్ని సంఘాలకంటె మనదే అగ్రతాంబూలమని నేను ఘంటాపథంగా చెప్తున్నాను. రాష్ట్రంలోని మన సోదరులందరూ ఆదర్శంగా ఉన్నందుకు గర్విస్తున్నాను. అందువల్లనే మన పాలకవర్గంవారు మన సంఘంమీదా, మనమీదా అంతులేని ఆదరణ, అద్వితీయ ఆప్యాయత చూపిస్తున్నారు. వారికి నా ధన్యవాదాలు! ముఖ్యంగా మన ఘనవిజయం మన ఏజంట్లకు, ముఖ్యులకు బదిలీ బెడద లేకుండా చేసుకోవటం. మనసంఘ సభ్యులకు సమితిలో అందరికంటె ముందు, మొదటి బ్యాచ్ లోనే ఇంక్రిమెంట్లతో సహా అన్ని సౌకర్యాలూ సాధించటం.

అయితే కొంతమంది ఉపాధ్యాయులు మనల్ని చూచి అసహ్యించుకొంటారనీ ... ముఖంమీద తిడుతున్నారనీ, నోట్లో ఊస్తున్నారనీ ఎవరూ ఏమీ బాధ పడనక్కరలేదు. గాంధి మహాత్ముడు యేంచెప్పేడు 'సహనం ... సహనం' అన్నాడు. ఈ చెంపపై కొడితే ఆ చెంప చూపమన్నాడు. పెద్దపెద్ద వాళ్ళే ముఖంమీద ఉమ్మినా, విమర్శించినా రవ్వంత కూడా బాధ పడటంలేదు. ఇహ ఆ బాధ మనకెందుకు? అలా శాంతంగా సహనంగా ఉండటమే మన నైతిక శక్తికి నిదర్శనం. మరొక విషయం ... సోదరులు చాలామంది యు. టి. యఫ్‌లో చేరిపోతున్నారనీ, ఆ కార్యకర్తలు డ్యూటీ విషయంలోను, రాయబార విషయాల్లోనూ, సమస్యా పరిష్కార సందర్భాల్లోనూ గట్టిగా నిలబడుతున్నారనీ, నిప్పుల్లా ప్రవర్తిస్తున్నారనీ మన కార్యకర్తలు వాపోవటాన్ని నేను గమనించాను. దానికి తగిన కార్యక్రమం మనం యీ సభలో నిర్ణయించుకోవాలి యు టి. యఫ్ కార్యకర్తల్ని దూర ప్రాంతాలకు బదిలీ చేయడమే దానికి మందు పీడా విరగడై పోతుంది. దానికి ప్లాను రెడీగా ఉంది. నేను మన బి.డి.ఓ గారితో మాట్లాడేను. వాళ్ళు వసూళ్ళ కార్యక్రమంలో అడ్డుపడుతున్నారనీ, బజారుకెక్కుతున్నారనీ చెప్పి వాళ్ళందరినీ దూరప్రాంతాలకు బదిలీ చేయాలని డిమేండ్ చేశాను. వారు మనకు దయతో హామీ నిచ్చారు. (చప్పట్లు) మిత్రులారా! ఒక చిన్న విషయం. అదే ... యీ మధ్య మన ప్రభుత్వంవారు అడగా పెట్టకుండానే ఉదారంగా 43% డి. ఏ. పెంచారు. ఆ పని చేయించుకోటానికి ప్రతి ఉపాధ్యాయుడివద్ద ఖచ్చితంగా ఏ మినహాయింపు లేకుండా ఒక నెల పెరిగిన డి.ఏ. వసూలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. దానికి మన యి.ఓ (ఎడ్యు) శ్రీ బంగాళాఖాతం బ్రహ్మానందరావుగారు

ఎదురు చూస్తున్నట్టు ఇప్పుడే కాకి కబురు అందింది. కాబట్టి యీ సదవకాశాన్ని చక్కగా వినియోగించుకోటానికి మీరంతా సిద్ధంగా ఉండాల్సిందిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

మిత్రులారా! మనం గతసంవత్సరం కిల్లీకొట్టువద్ద 30 సమావేశాలు, సినిమాలుదగ్గర 18. తడికెల బజారులో 12, బ్రాకెట్ సందులో 16 మొత్తం 76 సమావేశాలు జరుపుకొన్నాం. నూతన సంవత్సరంలో సెంటరుకు 5 తగ్గకుండా మొత్తం 50 సభ్యత్వం చేర్పించాలి. మన "బడాయిపత్రిక"ను సెంటరుకు ఒకటైనా తెప్పించాలి. మిత్రులారా! పదునైన కరుకైన ఉక్కుకవచంలాంటి కార్యదర్శి నివేదిక మీ ముందుంచాను. దీనిపై ఏరకమైన విమర్శలేకుండా ఆమోదించాలని ప్రార్థిస్తూ ముగిస్తున్నాను.

అధ్యక్షుడు ;- ఇప్పుడు శ్రీ తాగుబోతుల తాతబ్బాయి తీర్మానాలు ప్రవేశపెడతాడు.

తీర్మానాలు :-

1. ఫేషన్ సంఘ కార్యకర్తలు సంక్రాంతినాటికి మంచి ఖులపాటం పేంట్లు కుట్టించుకోవాలి. అందుకు కనీసం రు. 100/- లు పండుగ అడ్వాన్స్ యిప్పించాలి.

2. వాళ్ళని పెద్ద పెద్ద పాఠశాలల్లో రిజర్వు స్థానాల్లో నియమించాలి.

3. సమితి ఆఫీసులో గుమాస్తా (ఎద్యు) లకు వర్కు సహాయం చేయుటకు మన కార్యకర్తల్ని ఆఫీసులోపల ఎల్లప్పుడు ఉండుటకు పర్మిషన్ ఇవ్వాలి.

4. తనిఖీ అధికారులు పాఠశాలల్ని దర్శించినపుడు వారికి బాడీగార్డ్సుగా కార్యకర్తలు తోడుగాఉండటానికి అన్‌డ్యూటీ గ్రాంటుచేయాలి.

— ఈ తీర్మానాలు ఏకమొత్తంగా తమ ఆమోదానికి పెడుతున్నాను. (ఆమోదాన్ని సూచిస్తూ చప్పట్లు)

అధ్యక్షుడు :- అయ్యా! ఇప్పుడు మన ఎన్నికల ఆఫీసరు శ్రీ పక్షపాతం పళ్ళంరాజుగారు ఎన్నికలు జరిపిస్తారు.

ఎన్నికల ఆఫీసర్ పేనల్ లిస్టు చదువుతాడు.

అధ్యక్షుడు :- శ్రీ ముప్పతిప్పల ముకుందరావు.

ఉపాధ్యక్షులు :- సర్వశ్రీ అంబోతుల అప్పారావు, దున్నపోతుల ధర్మరాజు, వెధవవేషాల వెర్రయ్య.

ప్రధాన కార్యదర్శి :- శ్రీ పెద్దకడుపు పరమేశ్వరరావు.

కార్యదర్శులు :- సర్వశ్రీ కొవ్వన కృష్ణమూర్తి, బలిసిన బంగార్రాజు, మోసాల మీసాలయ్య.

(ఆమోదాన్ని సూచిస్తూ చప్పట్లు)

చివరికి శ్రీ పట్టిగడ్డి వీరన్నదొరగారు వందనసమర్పణ చేశారు.


M.J.S. & M.S.H.
CYCLE SHOP
DEALERS IN ALL KINDS OF
Cycle Spare parts And Accessaries
MAIN ROAD, GANNAVARAM.
KRISHNA DISTRICT

శ్రీ వివాసా ట్రేడర్సు
తాలూకా ఆఫీసు ఎదుట,
గన్నవరం, కృష్ణాజిల్లా.
మావద్ద అన్నిరకముల ఫ్యాన్సీ ఎలక్ట్రికల్స్ మరియు పాదరక్షలు సరసమైన ధరలకు లభించును.

సినూ ఎలక్ట్రానిక్స్,
మావద్ద అన్నిరకముల రేడియోలు, ఫ్యానులు మరియు ఎలక్ట్రికల్ సామానులు సరసమైన ధరలకు లభించును.
రేడియో, ఫ్యానుల రిపేరుకు మా ప్రత్యేకత.
మెయిన్‌రోడ్, గన్నవరం కృష్ణాజిల్లా.

Ch. VENKATRAMAIAH
MEDICAL & GENERAL STORES
సి. హెచ్. వెంకట్రామయ్య
మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్,
MAIN ROAD, WYRA.

# ప్రశ్నోత్తరాలు

**శ్రీ యం. వీరరాఘవులు, శక్రటరీ, టి. ఏ. సెంటరు పెద్దపవని, ప్రకాశం జిల్లా.**

ప్రశ్న : ఒక ఉపాధ్యాయుడు హెడ్మాష్టరుగారికి పర్మిషను వ్రాసుకొని, మొదటి పీరియడులోగాని, ఆఖరు పీరియడులో గాని, 30ని॥ల కాలము పాఠశాల వదులు పద్ధతి యిదివరలో యున్నట్లును, యిప్పుడా పద్ధతిని తీసివేసినట్లును, కొందరు ఉపాధ్యాయ మిత్రులు చెప్పుతున్నారు. పర్మిషను వ్రాసుకొని పాఠశాలను వదులు పద్ధతి ఉన్నదా లేదా? తెలియజేయండి.

జవాబు :- ఉన్నది. ప్రభుత్వ ఆఫీసులలో అవలంభిస్తున్న యీ విధానమును పాఠశాలల్లోకూడ గతమునుండి అవలంబిస్తున్నారు. ఆఫీసుల నిర్వహణ సందర్భములో జనరలు అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటు తే 14-4-67 న జి. ఓ. యం. యస్. నెం. 334 ద్వారా 2వ సవరణను జారీచేసి జిల్లా మాన్యుయల్‌లో 4 ఎ పేరాను యేర్పాటు చేసినది. అందులో "A member of the office establishment shall not leave the office during working hours without permission', అనియును "Members of the staff muy be permitted for valid reasons to leave office earlier as in the case of late attendance'. అనియును "The period of absence in this case should not exceed one hour", అనియును "The members of the, staff may leave office with the specific permission of the competent authority" అనియును ఉన్న విషయాలను పరిశీలించండి.

ప్రశ్న :- ఈ పర్మిషను పద్ధతి యున్నయెడల, ఎప్పుడు యెంతకాలము పర్మిషను వాడుకొ. వచ్చును. ఎవరికి ఎలా వ్రాసుకోవాలి ?

జవాబు :- బలమైన కారణాలుండి పాఠశాలను పనిగంటలలో వదలవలసినప్పుడు, పనిగంటలలో యెప్పుడైనను ఒక గంటకు మించకుండా, పర్మిషను వాడుకొనవచ్చును - పాఠశాలను వదిలి పర్మిషనుతో వెళ్ళవలసిన బలమైన కారణాలను ఉదహరించి, పాఠశాల హెడ్మాష్టరుగారికి పర్మిషను దరఖాస్తువ్రాసి వారి పర్మిషను పొందిన పిమ్మట పాఠశాలను వదిలి వెళ్లవలెను.

**శ్రీ సి. హెచ్. రోశయ్య, లింగగూడెం, ఖమ్మంజిల్లా.**

ప్రశ్న : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భముగా, మన రాష్ట్రపతి, ప్రధాని యితర మంత్రులు, సంక్షేమనిధికి విరివిగా విరాళాలు యివ్వవలసినదిగా విజ్ఞప్తులు చేశారు. ఈ సంక్షేమ నిధి, కార్యకలాపాలు, జాతీయ స్థాయిలోను మరియు రాష్ట్ర స్థాయిలోను యున్నాయా ? ఏ రకమైన ఉపాధ్యాయులకు, యెంతెంత మొత్తము సహాయము జేసారు? సహాయం కావలెనంటే, యే అధికారికి యేవిధంగా దరఖాస్తు పంపుకోవాలి ?

జవాబు : అవును, జాతీయ, రాష్ట్ర స్థాయిలలో యీ సంక్షేమ కార్యకలాపాలు యున్నప్పటికిని, ఫైనాన్షియల్ అసిస్టెన్సు పరిమితముగానే యుందని, బాధలలో నున్నవారు అభిప్రాయపడుతున్నారు. జాతీయస్థాయిలో, అవార్డులు, పారితోషికములు, రాష్ట్రస్థాయిలో, సర్వీసులోనున్న అర్హతగల ఉపాధ్యాయులకు, రిటైర్డు ఉపాధ్యాయులకు, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు ఆర్థిక సహాయము చేయాలనే లక్ష్యముతో యీ కార్యకలాపాలు జరుగుతున్నాయి. నిలువలో యున్న నిధులనుబట్టి సహాయము జరుగుతుంది. సహాయము కావలసినవారు నిర్ణీత దరఖాస్తు ఫారములను, జిల్లా విద్యాశాఖాధికారిగారి ఆఫీసునుండి పొంది పూరిజేసి, తిరిగి ఆ ఆఫీసు ద్వారానే డైరక్టరు ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్, మరియు శక్రటరీ, ట్రెజరరు, నేషనల్ ఫౌండేషనుఫర్ టీచర్సు వెల్ఫేరు, ఎ.పి, హైదాబాద్‌కు దరఖాస్తులు పంపుకోవలసి యుంటుంది.

**శ్రీ యన్. హనుమంతరావు, బి. ఏ. బి. యిడి. ఖమ్మం.**

ప్రశ్న :- ఫామిలీ బెనిఫిట్ ఫండు స్కీములో ఉపాధ్యాయుడు రిటైరు అగునాటికి చెల్లించిన కంట్రిబ్యూషన్ మొత్తముపై కొంత వడ్డీచొ॥న చెల్లించుచుతారని తెలిసినది. కాని అక్టోబరు సంచికలో కంట్రిబ్యూషన్ మొత్తమునకు ప్రభుత్వ కంట్రిబ్యూషన్ చెల్లించుచుతారని చెప్పినారు. ఆ జి ఓ. నెం. మరియు ఆ జి ఓ ప్రకటించవలసినదిగా కోరుచున్నాను.

జవాబు :- ఈ జి ఓ లో ఒకచోట Government Contribution representing the element of interest- అని పేర్కొన్నదానినిబట్టి యీ జి ఓ లో గవర్నమెంటు కంట్రిబ్యూషన్ అని యున్నదానిని వడ్డీగానే మేము పరిగణించుచున్నాము. అయితే యీ జి. ఓ. లో దానిని గవర్నమెంటు కంట్రిబ్యూషన్‌గా పేరుపెట్టి యున్నందువలన అక్టోబరు సంచికలో మేముగూడ ఆ పదమునే ఉపయోగించి జవాబునివ్వవలసి వచ్చినది ఈ జి ఓ ను 1975 సం॥పు ఐక్యఉపాధ్యాయ ఫిబ్రవరి సంచికలోనే ప్రచురించాం. పరిశీలించండి. అది జి. ఓ. యం.యస్. నెం 307 ఫైనాన్సు మరియు ప్లానింగు (ఫైనాన్సు వింగ్ పెన్షన్-II) డిపార్టుమేంటు తే 9-11-1974 అయి యున్నది.

**శ్రీ కె. వెంకట్రాజు, కొలమూరు.**

ప్రశ్న : ఫామిలీ బెనిఫిట్ ఫండు స్కీములో జేరి 30 సంవత్సరముల సర్వీసు పూరిచేయకుండా, మధ్యలో ఏకారణము వల్లనైనను, సర్వీసునుండి మానుకొన్నవారికి ప్రభుత్వ కంట్రిబ్యూషన్ లభిస్తుందా? లేక వారినుండి మినహాయించిన సొమ్మే యిస్తారా? వివరించండి.

జవాబు : వారినుండి మినహాయించిన సొమ్ముతో పాటు ప్రభుత్వ కంట్రిబ్యూషన్‌గూడ లభిస్తుంది ఉదాహరణకు 10 సంవత్సరములు కంట్రిబ్యూషన్ చెల్లించినవారికి, ఆ 10 సంవత్సరముల కంట్రిబ్యూషన్ రు. 1200 లతో పాటు ప్రభుత్వ కంట్రిబ్యూషన్ రు. 400 లతో కలిసి రు. 1600 లు లభిస్తుంది. అట్లే 17 సంవత్సరములు చెల్లించినవారికి వారు

చెల్లించిన రు. 2040 లతో పాటు ప్రభుత్వ కంట్రిబ్యూషన్ రు. 1556 లతో కలిసి రు. 3196 లు లభిస్తుంది. జి. ఓ. లో 1వ షెడ్యూలు క్రింద నున్న టేబిలులో అన్ని సంవత్సరాల వివరాలున్నవి పరిశీలించండి.

శ్రీమతి ఎ. నన్యానమ్మ, కండెక్టెస్,
అనకాపల్లి, విశాఖజిల్లా.

ప్రశ్న :- అక్టోబరు సంచికలో మీరు ప్రచురించిన కండక్టెస్సుల శలవు రూల్సునకు సంబంధించిన జి. ఓ. లోని నిబంధనలు, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూళ్ళలో పనిచేస్తూన్న కండక్టెస్సులకు వర్తించగలవా? వారికొరకు ప్రత్యేక జి. ఓ. యుంటే తెలియజేయండి

జవాబు :- వర్తించవు - మున్సిపల్ స్టాట్యూటరీ రూల్సులోని, లాస్టుగ్రేడు సర్వెంట్సుకు సంబంధించిన 'రూల్సు రెగ్యులేటింగ్, గ్రాంట్ ఆఫ్ లీవు, మరియు లీవు అలవెన్సులకు యిటువంటి సవరణ ఒక జి. ఓ. ద్వారా వచ్చి యుండవచ్చును. మీ మున్సిపల్ ఆఫీసులో భోగట్టాచేసి జి. ఓ. ను సంపాదించండి.

శ్రీ సి హెచ్. పిచ్చయ్య, సీతారాంపురం, నెల్లూరు.

ప్రశ్న :- నేను దసరాశలవులకు ముందురోజు స్కూలుకు హాజరయితిని, తిరిగి శలవుల అనంతరము ది 16-10-75 న ఉదయంపూట స్కూలుకు హాజరు కాలేకపోతిని, ఆ పూట శలవు పెట్టుకొనవచ్చునా ?

జవాబు :- ఎ. పి. లీవు రూల్సు 12 మరియు 22 ఎ ప్రకారం సదరు 16వ తేదీ ఒకరోజు శలవు పెట్టుకొనవచ్చును.

శ్రీ కె. అనంతరామరాజు, రాజవరము, నల్గొండ.

ప్రశ్న :- ఫ్యామిలీ పెన్షన్ రూల్సు తెలుపండి.

జవాబు :- 75 జూన్ నెల ఐక్యఉపాధ్యాయ పత్రిక యందలి నియమ నిబంధనలు చూడండి.

ఒక ఉపాధ్యాయుడు, రాజుపాలెం సమితి, గుంటూరు.

ప్రశ్న ;- మా సమితిలో టీచర్స్ డే టిక్కెట్లుకు బి. డి. ఓ. రూ 5/- లు, డి. ఐ. రూ. 5/- ప్రతి టీచరునుండి గుడ్డు పిండి వసూలు చేశారు. ఏమి చేయాలి ? ఇది ఎవరికి లాభం ?

జవాబు : ఉపాధ్యాయ సంక్షేమానికి టీచర్స్‌డే అంటూ వారినుండి యిలా వసూలు చేయడం దారుణం. ఇది ప్రభుత్వ దృష్టిలో వుంచాం. లాభమంటారా! అవుసరాలకు ఉపయోగ పడింది చాల తక్కువ.

శ్రీ డబులెమ్మే, తూ. గో. జిల్లా.

ప్రశ్న : క్రొత్తగా పెరిగిన డి. ఎ. మెర్జరు జీతం వల్ల నాకు రు. 22 లు పెరిగింది. బట్టలకొట్టులోకి వెళితే ఒక కాలికే బట్ట వచ్చింది. రెండో కాలికి తీయించుకోటానికి మళ్ళీ ఎప్పుడు పెరుగుతుంది.

జవాబు : జనవరి నుండి పెరిగింది. అయినా పెరుగు దలలో తేడాలవల్ల చెరో కాలికి చెరో రకం బట్టలు వస్తాయి. ఎంతుకి అతుకుల బొతుకుల భాగోతం, సంఘ పిలుపు అందు కొని, జనరలు ఫండుకు విరాళ మివ్వండి.

## గుసగుసలు

### స్వీపర్ ఉద్యోగానికి గొర్రె పొట్టేలు

మహబూబ్‌నగర్‌జిల్లా, బిజినాపల్లి సమితి యి. ఓ. (ఎడ్యుకేషన్) అనేక అవినీతి కార్యక్రమాలు కొనసాగిను న్నాడనీ, ఎమర్జన్సీ ప్రవేశపెట్టిన తర్వాతకూడా కోటాల్ గడ్డలో ఒక పేద యువకుడికి స్వీపర్ ఉద్యోగం యిస్తానని అతనిదగ్గర రు 110 ల విలువగల గొర్రెపొటేలును తీసుకొన్నా డని బిజినాపల్లి బస్‌స్టాండులో బహిరంగంగా చెప్పుకొంటు న్నారు.

### దళారీల బెడద-టేపురికార్డు

తూ. గో. జిల్లా కపిలేశ్వరపురం, రంగంపేట, ముమ్మిడి వరం, అమలాపురం, సామర్లకోట, రాజానగరం సమితులలో మెర్జర్‌స్కేళ్ళ ఎరియర్స్ చెల్లించే సందర్భంలో కొంతమంది దళారీలు ఉపాధ్యాయులమీద అతిప్రేమ ఒలకబోస్తూ, వచ్చేది పండగ. డబ్బు అవసరం. అప్పులు దొరకవు. మనకు రావల్సిన అరియర్సు ఈ పండగముందు రాబట్టాలంటే కాకినాడలో వున్న ఆడిట్ ఆఫీసులో అమ్యామ్యా ముట్టజెప్పాలి' అని ఆశలుపెట్టి వసూళ్ళు చేస్తున్నారనీ, కపిలేశ్వరపురం సమితిలో రు 2500, రంగంపేట సమితిలో రు 980 అలా గోళ్ళూడగొట్టి వసూలు చేశారనీ, ఇదేసందను కొని కపిలేశ్వరపురం యి. ఓ. ఎడ్యుకేషన్ స్వామివారి వ్రతం పేరుతో రు 1000 దాకా వసూలు చేశాడని జిల్లాఅంతటా టీచర్లు గొడవగా చెప్పుకుంటు న్నారు.

రంగంపేట సమితిలో దళారీలు పోటాపోటీపడి ఆడిట్ వారిని అడ్డంపెట్టుకొని సగంభక్తి సగంముక్తి అన్నట్టుగా నిలువుదోపిడీ సాగిస్తున్నారనీ, వసూళ్ళు జరుగుతుండగా అక్కడి యు. టి. యఫ్ కార్యకర్తలు పెద్దాపురం తాలూకా ఆఫీసులో టేపురికార్డుచేసి జాగ్రత్త చేశారనీ తెలుస్తున్నది.

---

ఒక ఉపాధ్యాయిని, త్యాళ్ళూరు గుంటూరుజిల్లా.

ప్రశ్న : అరియర్సు యివ్వాలంటే లంచం యిచ్చుకో వలసిందేనా? యివ్వకపోతే ఉద్యోగానికి అపాయమా? వచ్చి నప్పుడే తీసుకుంటామంటే ఏమి ?

జవాబు : ఇవ్వనక్కర లేదు. ఉద్యోగానికి ఏమీ ప్రమాదం లేదు. మీ ఆలోచనా విధానమే దానికి కొంతవరకు మందు. మీ రంతా ఉద్యమానికి సహకరించిననాడు సమా జానికి చీడపురుగుగా దాపురించిన లంచగొండి విధానాన్ని నిర్మూలించి సమాధి చేయవచ్చు.

# సీనియారిటీ

శ్రీ పి. భాస్కరశర్మ, ఎం.ఏ, బి ఇడి.
హైదరాబాద్ నగర యు. టి. యఫ్. శాఖ అధ్యక్షులు

(ఏ పోస్టులో ఉన్నా అర్హతనుబట్టి స్కేలు ఇవ్వాలనేది యు టి యఫ్ నినాదం. ఉపాధ్యాయ వృత్తిలోకి మేధావంతులు ఆకర్షింపబడాలంటే వారి స్కేళ్ళు ఆకర్షణీయంగా ఉండాలనీ, ప్రత్యేకార్హతలు సంపాదించినవారికి ప్రత్యేక ప్రోత్సాహం అవసరమనీ కొఠారీ కమీషన్ కూడా నొక్కి వక్కాణించింది. కాని ప్రస్తుతం ఆచరణలో తద్విరుద్ధమైన విధానాలే అవలంబింపబడుతున్నయ్. దానికుదాహరణే (యీ 'సీనియారిటీ' వ్యాసం. —సం॥)

## ప్రమోషన్ రూల్సు

ఒక స్కేలునుండి మరొక స్కేలుకు ప్రమోషన్ చేయుటకు గాను ఆంధ్రప్రదేశ్ సబార్డినేట్ సర్వీసు రూల్సు ను పాటించటం పరిపాటి. ఆ రూల్సులో 34 (బి) (i) లో...

**'Promotions in a Service or class to a selection category or to a selection grade shall be made on grounds of merit and ability, seniority being conisi' dered only merit and ability are approximately equal-** అని ఉంది.

ఆ రూల్సులో మెరిట్ (యోగ్యత)ఎబిలిటీ (సామర్థ్యం) అనే రెండుపదాలు ప్రమోషన్ అర్హతలను సూచిస్తున్నయ్. కాని ప్రస్తుతం బి. యిడి శిక్షణ పూర్తయి సర్వీసులో కొనసాగుతున్నవారెందరో ప్రమోషన్ కొరకు ఏళ్ళతరబడి చాతకాల్లా ఎదురుచూస్తున్నారు. కాని వాళ్ళ నిరీక్షణ నిరీక్షణగానే ఉండిపోతున్నది.

పైరూల్సులో మెరిట్ అండ్ ఎబిలిటీలను విశదీకరింపక పోవటం యీ ఆశాభంగానికి ప్రధానకారణం. ఆపదాలకర్థాలే వాటిని వివరిస్తున్నవిగదా అంటే 'మరి ప్రమోషన్‌కు సీనియారిటీ' ప్రశ్న ఎందుకు? ఆ సీనియారిటీలిస్టును తడవతడవకీ తలక్రిందులుచేయటం దేనికి? అనే ప్రశ్న ఉదయిస్తాయి.

మెరిట్, ఎబిలిటీలు

ప్రతిజిల్లాలో ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ శిక్షణ (కాలేజి అఫ్ ఎడ్యుకేషన్) తరగతుల్ని ఏర్పాటుచేస్తున్నారు. వీటిల్లో బి ఏ, బి.యస్.సి బి. కాం పరీక్షల్లో ఉత్తీర్ణులైనఉపాధ్యాయులకుగూడ శిక్షణయివ్వటానికి నిర్ణయింపబడింది అనగా పైనజెప్పిన రూల్సులో 'మెరిట్'అనేపదానికి తగినట్లుసర్వీసులో ఉన్న ఉపాధ్యాయుడు ఆ 'యోగ్యత'నుకూడ పొందితేనేగాని శిక్షణ తరగతులకు హాజరవటానికి వీల్లేదుగదా!

శిక్షణాకాలం పూర్తయిన పిదప శిక్షితులను పరీక్షించి సర్టిఫికేట్లు ఇస్తున్నారుగదా! అనగా ఎబిలిటీ (సామర్థ్యం) పొందినాడనిగదా దానిభావన! మరి రూల్సు ప్రకారం ప్రమోషన్‌కు కావలసిన మెరిట్, ఎబిలిటీ అనేవి వారికున్నాయనేది అతిసామాన్యుడికికూడా అర్థమయ్యే విషయం.

కానీ ఆచరణలో దానికి విరుద్ధంగా జరుగుతున్నది. (1) ఆయాపాఠశాలల్లో ఖాళీలున్నా వెంటనే ప్రమోషన్ ఇవ్వక కాలహరణం చేస్తున్నారు. (2) చివరకి ఆ ఖాళీలను పూరించే సమయంలో 'సీనియారిటీ' అనే మరో సమస్య లేవదీయబడి పరిస్థితి విషమం చేయబడుతున్నది.

ఈ సీనియారిటీ నిర్ణయం చాలా ఆఫీసుల్లో ఒక కబంధహస్తంగా తయారయింది. కొన్నిచోట్ల ఆఫీసర్ల, గుమస్తాల ఇష్టానుసారం జరుగుతూ అనేక పక్షపాతాలకు అన్యాయాలకు ఆలవాలం అవుతున్నది. మడతపేచీగా తయారైన ఈ "సీనియారిటీ"ని ఇక్కడ కొంత వివరించాల్సిన అవశ్యకతవుంది.

పైన పేర్కొనబడిన ప్రమోషన్ రూల్సులో "సీనియారిటీ బీయింగ్ కన్సిడర్డ్ ఓన్లీ మెరిట్ అండ్ ఎబిలిటీ ఆర్ ఎప్రాక్సిమేటీ యీక్వల్" అని ఉంది. అనగా ఒకే పర్యాయం పదిమంది టీచర్లు శిక్షణపొంది ఎబిలిటీ (సామర్థ్యం) గడించారనుకొందాం. కాని డిపార్ట్‌మెంట్‌లో ఏడు స్థానాలే ఖాళీగా ఉన్నపుడు పై పదిమందిలో ఎవరికి ప్రమోషన్ ఇవ్వాలి? అనే ప్రశ్న ఉదయిస్తుంది. పై పదిమందికి మెరిట్ అండ్ ఎబిలిటీ సమానమే. కాని వీరందరు ఒకేసారి ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన వారు కాదు. అనగా "డేట్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ఇన్ ది ప్రజంట్ గ్రేడ్" ఒకటిగాదు. ఉదాహరణకు రు 96-200 స్కేలులో ఒక టీచరు 1954 లో ఇంకొకరు 1953 లో మరొకరు 59 లో ఇలా వివిధ సంవత్సరాలలో సర్వీసులోకి వచ్చారనుకొందాం. వీరందరు శిక్షణ పొందటానికి కావల్సిన యోగ్యత వేరువేరుగా పొందినా శిక్షణయందు మాత్రం ఒకేసారి సామర్థ్యాన్ని గడించినవారుగా నిర్ణయింపబడిరి. కాని ఖాళీలు ఏడు, అర్హత సంపాదించినవారు పదిమంది. మరి వీరిలో ఎవరిని పై ఖాళీలో నియమించేటట్లు? అప్పుడు సీనియారిటీ లిస్టు సర్వీసు ప్రాతిపదికగా ఈ క్రింది విధంగా తయారు చేయబడుతుంది.

| వరుస నెంబరు | వ్యక్తి పేరు | నియమింపబడిన తేదీ |
|---|---|---|
| 1. | ఎ | 1953 జనవరి 3 |
| 2. | బి | 1954 మార్చి 5 |
| 3. | సి | 1955 జూన్ 8 |
| 4. | డి | 1956 ఆగష్టు 1 |
| 5. | యి | 1956 ఆగష్టు 8 |
| 6. | యఫ్ | 1957 జూలై 10 |
| 7. | జి | 1958 సెప్టెంబరు 2 |
| 8. | హెచ్ | 1960 ఫిబ్రవరి 4 |
| 9. | ఐ | 1960 ఫిబ్రవరి 20 |
| 10. | జె | 1961 అక్టోబరు 6 |

— ఇలా సీనియారిటీ లిస్టును తయారుజేసి 1 నుండి 7 వరకు గల ఉపాధ్యాయులను ఉన్న 7 ఖాళీల్లోకి ప్రమోట్ చేయాలి మిగిలిన ముగ్గురు ఖాళీలు ఏర్పడే వరకు అలాగే నిరీక్షించాలి. ఉదాహరణకు హెడ్మాష్టర్సు పేనల్‌లో ఇలాగే జరుగుచున్నది.

మరుసటి సంవత్సరం మరి 9 ఖాళీలు రావటం, మరి 10 మంది శిక్షణ పొంది రావటం జరుగుతుందనుకొందాం. వారి పదవీ నియామకాన్ని బట్టి మళ్ళీ సీనియారిటీ లిస్టు

తయారుచేయాల్సి ఉంది. క్రిందటి బ్యాచ్‌లో మిగిలిపోయిన ముగ్గురి పేర్ల క్రింద (అర్హత ముంతు పొందేరు గాన) ప్రస్తుత బ్యాచ్‌లో అర్హత పొందనవారి పేర్లు ఆర్డర్ ఆఫ్ ప్రిఫరెన్సులో వ్రాయాల్సి ఉంది. కాని ప్రస్తుతం అలా జరగటం లేదు.

ప్రథమంలో జేర్చాల్సిన పై ముగ్గురు మళ్ళీ ప్రజంట్ గ్రేడ్‌లో నియామక తేదీలను బట్టి మందలో కలిసి సీనియారిటీ లిస్టులో క్రిందికి నెట్టబడుతున్నారు. అనగా ఖాళీ పోస్టుల్ని శిక్షణ పొందిన సీనియారిటీని బట్టిగాక, ఏ సంవత్సరానికా సంవత్సరం సర్వీసు సీనియారిటీని బట్టి మళ్ళీ మొదటికి తెచ్చి ఖాళీలు నింపుతున్నారు. క్రితం సంవత్సరం సీనియారిటీ ఆర్డరులో 8,9,10 గా నిలబడిన ఉపాధ్యాయులు మళ్ళీ ప్రజంటుసీనియారిటీ లిస్టులో (సర్వీసును బట్టి) 18,19,20 గా చేర్చబడుతున్నారు. ఇది చాలా అన్యాయం. మొదటి బ్యాచ్‌లోని వారైన 8,9,10 లకు 34 (బి) (ఐ)లో చెప్పబడిన మెరిట్ అండ్ ఎబిలిటీలు లేవా? ఉన్నవారెందుకు వెనుకకు నెట్టివేయబడుతున్నారు? ఇవీ విచక్షణా జ్ఞానం గలవారికి తోచే ప్రశ్నలు. ఈ విషయమై విద్యాశాఖకుగాని, శాసనమండలిలో ఉపాధ్యాయ ప్రతినిధులకుగాని ఎవ్వరికి అంత శ్రద్ధ కన్పించటంలేదు. ఆ అశ్రద్ధవలన అనేక మంది టీచర్లు ప్రమోషన్ల సందర్భంలో ఆయా ఆఫీసు గుమాస్తాల దయాదాక్షిణ్యాలకు గురిచేయబడుతున్నారు. విస్సన్న చెప్పిందే వేదం అన్నట్టు వారేది చెప్తే అదే ధర్మంగా ... అదే న్యాయంగా ... అదే రూలుగా పరిగణనలోకి వస్తున్నది.

## వైకుంఠపాళి

మీరు వైకుంఠపాళీ పటంచూసే ఉంటారు. అందులో నిచ్చెనవస్తే పావు పైకెక్కుతుంది. పామునోట్లోబడితే తోక చివరికి చేరుకుంటుంది. కాని పై వివరించిన వారి బ్రతుకులు మాత్రం సీనియారిటీ లిస్టుల తతంగంలో ఎప్పుడూ పాము నోట్లోనే బడుతున్నది.

ఉదాహరణకు ఒకరు హైదరాబాద్ నగరంలో రు 96-200 స్కేలులో పని చేస్తూ 1969 లో బి. యి. డి అయ్యారు. 1972 అక్టోబరులో తయారైన సీనియారిటీ లిస్టులో అతని వరుస నంబరు 21. ఆ తర్వాత 1975 మేలో తయారుచేసిన సీనియారిటీ లిస్టులో అతని పేరు 42 నంబరులో క్రిందికి దిగింది. అంటే ఏళ్ళు గడుస్తున్న కొద్దీ, సర్వీసు పెరిగినకొద్దీ వరుస నంబరు కూడా పెరిగిపోతున్నదేగాని తగ్గటంలేదు. మరి ప్రమోషన్ పదవీ విరమణ చేసేలోగా దొరుకుతుందో లేదో! ఇది నాకు అనుమానం.

## ఒకరికి అన్నం .... మరొకరికి సున్నం

ప్రమోషన్ అనేపదం ఏ కేడర్‌కు చెందినా అది ప్రమోషనే! కాని అదే పదం టీచింగ్ స్టేఫ్‌కు ఒక విధంగాను నాన్ టీచింగ్ స్టేఫ్‌కు మరొక విధంగాను అన్వయింప బడుతున్నది.

యల్.డి.సి.గా ఉద్యోగిని నియమించటానికి ప్రస్తుత రూల్సు ప్రకారం మెట్రిక్యులేషన్ అర్హత ఉంటేచాలు. అదే ఒక ఉపాధ్యాయుడుగా నియమింపబడాలంటే మెట్రిక్యులేషన్ + శిక్షణ ఉండాలి. ఈ శిక్షణకు సంవత్సరంనుండి రెండు సంవత్సరాలదాకా కాలపరిమితి ఉంది. కాని స్కేలుమాత్రం మొదట యిద్దరికీ ఒక్కటే (90-192) పెద్దఎత్తున ఆందోళన జరిగితే శిక్షణపొందిన టీచర్‌కు 96-200 గా 910 జి ఓ లో వర్గీకరింపబడింది. మళ్ళీ మెర్జెడ్ స్కేల్సులో ఆ తేడా తీసివేసి అందరికీ సమమట్టంచేసి సమస్యను మళ్ళీ మొదటికి తెచ్చారు. రు 6 ల వ్యత్యాసాన్ని ఒకసంవత్సరం లేక రెండుసంవత్సరాల కాలపరిమితికి సమానమని చూపుట ఒక అన్యాయమైతే మళ్ళీ అదికూడా లేకుండాచేయటం పరమ అన్యాయం.

ఇది ఇలాఉండగా ఖాళీలు ఏర్పడినపుడు సర్వీసు సీనియారిటీనిబట్టి యల్.డి సి యు.డి.సి గా ప్రమోట్ చేయబడుతున్నాడు. ఒక యల్.డి.సి యు.డి సి గా మారాలంటే అతను కష్టపడి తన విద్యార్హతను పెంచుకోనవసరంలేదు. కాని ఒక యస్ జి బి టి, బి,యిడి అసిస్టెంటుగా ప్రమోషన్ పొందాలంటే మెట్రిక్యులేషన్ తదుపరి ఇంటర్ 2 సం.లు + డిగ్రీ 3 సం.లు + శిక్షణ 1 సం. మొత్తం 6 సం.లు కష్టపడి చదవాలి. కాని చివరికి లభ్యమయ్యేది ఏళ్ళతరబడి నిరీక్షణ. యల్.డి సి, యు డి.సి గా మారుట అతిసులువుగా ఉండగా యస్.జి.బి.టి, బి యి.డి అసిస్టెంటుగా మారుటకుగల కాఠిన్యాన్ని మనపెద్దలు ఏల ఆలోచించరో? ఒకవేళ ఆలోచించినా ఆచరణ యోగ్యంగా ఏలమలచరో అర్థంగాకుండా ఉంది.

ఇక్కడ ఒక్క విషయం ముచ్చటించాల్సివుంది. రైల్వే పాఠశాలల్లో బి. ఎ. బి. ఎస్. సి. లేక బి. కాం యోగ్యతగల ఇన్‌సర్వీసు టీచర్స్ అంతకు పూర్వం ఇ.జి బి.టిగా గాని, ఎస్.జి.బి. టిగాగాని అయివుంటే తిరిగివారు బి. యి. డి శిక్షణతో నిమిత్తలేకుండగనే డిగ్రీపుచ్చుకొన్న తదుపరి 5 సం.ల సర్వీసు చేసినట్లయితే వెంటనే బి. యిడి స్కేలు యివ్వటం ఆచారంగా ఉంది. అంతేగాక దాన్ని డిపార్టుమెంట్‌వారు ఒక రూల్‌గా కూడ రూపొందించారు. మరి మనమేపాపం చేసుకొన్నామో అట్టి అవకాశం ఎ. పి ఎడ్యుకేషన్ రూల్సులో ఇంతవరకు అనుసంధింపబడలేదు ఈ విధానం ఒకరికి అన్నం మరొకరికి సున్నం సామెతగాలేదా?

ఇంత కష్టాన్ని అనుభవించి చివరికి బి యిడి ప్రమోషన్ పుచ్చుకొన్నా తేడా ఏమంటే కేవలం రు 10 లు మాత్రం. ఏశ్రమలేకుండానే యల్.డి సి. ( బైవర్తు ఆఫ్ సీనియారిటీ ) యు డి. సి.గా మారి రు 310-560 స్కేలును పొందుతుంటే కష్టనష్టాలనుభవించి, అధికశ్రమకోర్చి అధిక విద్యార్హతలు పొంది, బి. యిడి అసిస్టెంటుగా మారినా వచ్చే ప్రతిఫలం రు 320-580 స్కేలు. ఆ రేండ్ల శ్రమ రు 10 లతో సమానం. ఇది ఎంత శోచనీయస్థితో ఆలోచించండి.

విద్యా బోధనలో ప్రతి ఉన్నతపదవికి ప్రత్యేక ఉన్నత విద్యార్హత నిర్ణయింపబడినపుడు సీనియారిటీ విషయమై ఉపాధ్యాయ ఉపాధ్యాయేతరులకు అందరికి కలిపి ఒకేసీనియారిటీ రూలు ఏలనిర్ణయించాలి? మారుతున్న సమాజానికనుగుణంగా విద్యా విధానాన్ని మార్చవలసిన ఈ స్థితిలో దానికి బాధ్యతవహించే ఉపాధ్యాయులపట్ల ఈ అనాదరణ, ఇన్ని గుంటచిక్కులు కల్పించటం ప్రోత్సాహానికిగాక నిస్పృహకూ నిరాశకూ దారితీస్తుందనటం నిర్వివాదాంశం. దానికి ప్రత్యక్ష నిదర్శనం యీ సీనియారిటీ ప్రహసనం.

# నూతన మూల్యాంకన

అనుభవముగల ఒక విద్యాధికారి

## లక్ష్యము                స్పష్టీకరణలు

1. విషయ జ్ఞానము :

I. పై అంశముల జ్ఞానమున అవసరము వచ్చినప్పుడు జ్ఞప్తికి తెచ్చుకొనును. II. ఆయా సందర్భములలో గుర్తించును III. అర్థము జేసికొనును,

2. భాషా జ్ఞానము :

I. ఉదాహరణలు సొంతముగా నిచ్చును. II. దోషముల గుర్తించి సవరించును III వేగముగా చదువును IV. విరామ చిహ్నములను గుర్తించును V. పద్య గద్య అన్వయముల తెలుపును VI. సారాంశము గ్రహించును. VII స్పష్టముగా చదువును VIII. వాగ్రూపమున వ్యక్తపరచును.

3. సాహిత్య జ్ఞానము :

I. దోషరహితముగ, స్పష్టముగ చదువును II. భాషాను గుణముగ స్వరభేదముతో మాట్లాడును III భావానుక్రమముగ సభా కంపన లేకుండ మాట్లాడును IV. సందర్భోచితముగ – విమర్శనాత్మకముగ – సభ్యతను పాటించి మాట్లాడును V. వర్ణక్రమ దోషరహితముగ – వ్యాకరణయుక్తముగా వ్రాయును VI. స్థాయికి దగిన శైలిలో సముచిత పద ప్రయోగముతో వాక్య నిర్మాణము చేయును VII పరిచ్ఛేదములుగా విభజించి విషయమును సంక్షిప్తముగ – విపులముగ – అవసరానుగుణ్యముగ వ్రాయును. భాషేతరములలో మొదట చెప్పిన జ్ఞానము, అవగాహన, నైపుణ్యము తదనుగుణమగు స్పష్టీకరణలు విద్యార్థికి పరిచయమై యుండును.

పైమూల్యాంకనా విధానమున ఉపాధ్యాయుని పనులు ముఖ్యముగా రెండు. ఒకటిబోధనాసామాగ్రిని తయారుచేసి కొనుట, రెండు మూల్యాంకనా సామాగ్రిని తయారుచేసి కొనుట.

1. బోధనాసామాగ్రి (a) సంవత్సర పధకము (b) యూనిట్ పధకము (c) పాఠ్యపధకము (d) బోధనోపకరణలు.

2. మూల్యాంకన సామాగ్రి :- (a) యూనిట్ పరీక్షలు (b) నిర్దేశములు.

ఇవికాక ఉపాధ్యాయుడు పాఠశాలకు సంబంధించిన కనీస అభివృద్ధిపధకము, ప్రణాళికావర్గత, ప్రణాళికేతరకలాపములకు వలయు వక్తృత్వము, వ్యాసరచన, విషయైక సంఘ కలాపములు, విహారయాత్రలు, పాఠశాల ప్రభుత్వము, అనుదినసమావేశాలు, వార్షికోత్సవములు, ప్రదర్శనశాలలు, బాలభటుసంఘములు, క్రీడలు మొ॥ వివిధకార్యకలాపనిర్వాహణ పధకాలు తయారుచేసుకోవడము ముందుగా సంవత్సర పధకమును తయారుచేయు విధమును పరిశీలింతము.

5వ తరగతి సామాన్య శాస్త్రమునకు సంవత్సరపధకమును ముందు తయారుచేయడము. ముందుగా మనకు బోధనకు అందుబాటులోనుండు పిరియడులను నిర్ణయించుకొనవలెను.

ఉదాహరణకు :- మొత్తం బడిపనిచేయుదినాలు 220.

1. ఉపాధ్యాయుని క్యాజువల్ శలవుకొరకు 19
2. పరీక్షల నిర్వహణ కొరకు 20
3. రివిజనుకొరకు 12
4. ఇతర అనుకొనని యిబ్బందులు 13

64=64

అందుబాటులోనున్న రోజులు 156

సరియగు వారములు 26

వారానికి సామాన్యశాస్త్ర బోధనకు కేటాయింపబడిన పీరియడులు 5

కనుక మొత్తం అందుబాటులోనుండు పిరియడులు $26 \times 5 = 130$

మనము యీ 130 పిరియడులను దృష్టిలో నుంచుకొని సంవత్సర పధకము వేసికొనవలసియుండును.

(సంవత్సరపధకం వచ్చేసంచికలో)


ఆహ్వానము

సరుకు నాణ్యం !        ధర సరసం !!

ఫోన్ : 79

స్టీల్ సేల్సు,

స్థూపం వద్ద గన్నవరం. కృష్ణాజిల్లా

అన్ని రకముల ఇనుప సామానులు, రంగులు మావద్ద లభించును.

మహబూబ్ ఫాన్సీ అండ్ జనరల్ స్టోర్సు

గాంధీ చౌక్ – గన్నవరం.

మావద్ద అన్నిరకముల ఫాన్సీ, కంగన్, పాదరక్షలు మరియు ఎలక్ట్రికల్ సామానులు

సరసమైన ధరలకు లభించును.


జీవితచందా చెల్లించినవారు

కుమారి పి. పేరిందేవమ్మ,

అవులవారిపాలెం, గుంటూరు.

# మనము-మన ఆరోగ్యం

డా. యమ్. రామారావు, యం.బి.బి.యస్

ప్రజావైద్యశాల, విజయవాడ.

## కుష్ఠు (Leprosy)

కుష్ఠు అనాదిగా అందరికీ తెలిసిన జబ్బు. ఇది 'మైక్రో బాక్టీరియం లెప్రా' అనే క్రిములవల్ల వస్తుంది. ఇవికూడా టి. బి క్రిములకువలెనే ఉంటాయి. వీటిని ప్రస్తుతంవున్న మందులేవీ త్వరగా చంపలేవు. అందువలననే ఇది భయంకరవ్యాధిగా పరిగణింపబడుతూ వుంది. ఈజబ్బు అంటుజబ్బు. పిల్లలలో త్వరగా వ్యాపిస్తుంది. ఈ క్రిములు చర్మంలోనూ, నరాల లోను ఎక్కువగా వ్యాపిస్తాయి. ఎముకలు, కళ్ళకుకూడా వ్యాపించగలవు. క్రిములు శరీరంలో ప్రవేశించిన తర్వాత వ్యాధిలక్షణాలు కన్పించటానికి 1 నుండి 5 సం ల వరకు పట్టవచ్చు.

**వ్యాధి లక్షణాలు :-** ఈ వ్యాధి ముఖ్యంగా రెండు రకాలు. (1) లెప్రమేటస్ లెప్రసీ (Lepramatos Leprasy) (2) ట్యూబర్క్యులాయిడ్ లెప్రసీ (Tuberculoid Leprasy)

మొదటిరకం వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి కనిపిస్తుంది. చర్మానికి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ రకంలో చర్మంమీద మచ్చలు అనేకం ఉంటాయి. రెండు ప్రక్కలా ఉంటాయి. ఈ మచ్చలు చర్మంతో సమంగా ఉండవచ్చు, చర్మంపైకి ఉబ్బివుండవచ్చు. మచ్చ అంచులు మాత్రమే చర్మంకంటే పైకి లేచిఉండవచ్చు. కొన్ని సందర్భాలలో బుడిపెలు కూడా ఏర్పడవచ్చు. కొద్దిమందిలో వ్యాధి ఎక్కువగా ఉన్నప్పుడు కొన్ని లేక పైజెప్పిన అన్ని రకాల మచ్చలు ఉండవచ్చు.

చర్మమంతా సమంగావుండే చిన్నమచ్చలతో ఈవ్యాధి ప్రారంభమవుతుంది. ఈ మచ్చలు కొన్నిసార్లు రాగిరంగులోనూ, కొన్నిసార్లు చర్మంకంటే కొంచెంతెల్లగానువుంటాయి. ఈ మచ్చలకు మెరుపువుంటుంది. ఈ దశలో మచ్చలు దురద పెట్టకపోవటం, స్పర్శ తెలియటం, చెమటపట్టడంవలన గుర్తించటం కష్టమౌతుంది.

చర్మంకంటె ఎత్తులేచినమచ్చలు బుడిపెలు చెవులమీద ముఖంమీద ఎక్కువగా కనిపిస్తాయి. కొంతమందిలో చర్మం అంతా ఉబ్బి రాగిరంగులో మెరుస్తూవుంటుంది, కనుబొమ్మలపైనా రెప్పలపైనా వెంట్రుకలు రాలిపోతాయి. కొన్ని సందర్భాలలో చర్మంపైనికూడా రాలిపోవచ్చును.

వ్యాధి పెరిగినకొద్దీ నరాలకు కూడా వ్యాపిస్తుంది. నరాలులావెక్కుతాయి. స్పర్శజ్ఞానం నశిస్తుంది. వేడి చల్లదనం తెలుసుకొనే జ్ఞానం ముందుగా పోతుంది. అందువల్లనే కుష్టు రోగులు చేతులు కాళ్ళు తరుచు కాల్చుకోవటం జరుగుతుంది. కాలినా నొప్పి ఉండదు గనుక వారికి కాలినట్లే తెలియదు.

అనియంత్రిత నరాలకు ఈ క్రిములు వ్యాపించటంవలన రక్తప్రసరణలో మార్పులు వచ్చి కాళ్ళుచేతులకు వాపులు రావచ్చును. ఎముకలకు, చేతివ్రేళ్ళకు, కాలివ్రేళ్ళకు కూడా యీ క్రిములు వ్యాపించటంవల్ల, స్పర్శలేకపోవటంవల్ల పుట్టే పుళ్ళు, దెబ్బలవల్ల వ్రేళ్ళను తినివెయటం జరుగుతుంది.

రెండవరకం (Tuberculoid Leprasy) వ్యాధినిరోధక శక్తి హెచ్చుగానున్నవారిలో కనిపిస్తుంది. ఈరకం చర్మంపై ఏర్పడిన మచ్చలు చిన్నవిగా సామాన్యంగా వొకేప్రాంతంలో వుంటాయి. ఈరకం నరాలకు ఎక్కువగా త్వరగావ్యాపిస్తుంది. నరాలు లావెక్కటం, స్పర్శజ్ఞానం, చలనశక్తి నశించటం వ్యాధిసోకిన కొద్దికాలానికే జరుగుతుంది.

చర్మంమీది మచ్చలకు స్పర్శజ్ఞానం వుండదు. రాగి రంగులో, చెమట పట్టకపోవటంవల్ల పొడిగా వుంటాయి. అంచులు స్పష్టంగా తెలుస్తాయి. తెల్లటి మచ్చలు ఈ రకంలో కూడా కనిపిస్తాయి. ఈ రకంలో పుళ్ళు పడటం ఎక్కువగా జరుగుతుంది.

చేతికిగాని, కాలికిగాని నొప్పిలేకుండా, కాలటంగానీ, పుళ్ళుగాని, దెబ్బలు గాని వున్నట్లయితే కుష్టు గురించి ఆలోచించవలసి వుంటుంది.

**Reactions : రియాక్షన్స్**

ఇవి రెండురకాలు. మొదటిరకంలో చర్మంపైనున్న మచ్చలు త్వరగా పెరగటం, ఎర్రబడటం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో జ్వరము, కాళ్ళు చేతులు వాపు, తిమ్మెర్లు రావచ్చు. నరాలుకూడా Involve అయినప్పుడు పాదాలు ముంజేతులు పడిపోవటం వంకరపోవటం సంభవించవచ్చు. ఈ Reaction తగ్గేటప్పుడు మచ్చలపై పొరలు ఊడిపోవటం, పుళ్ళుపడటం జరగవచ్చు. వైద్యం ప్రారంభించిన మొదటిదశలోనే ఈ Reaction వస్తుంది. రెండువరకు ఎలర్జిక్ (Alergic) రియాక్షన్. ఇది Lepramatus Leprasy లోనే కనిపిస్తుంది. లెప్రా క్రిములలోవచ్చే మార్పు ఇందుకుకారణమని ఒకభావం. వేరే క్రిములు శరీరంలో ప్రవేశించటంవల్లా కొన్ని మందులు, అధికశ్రమ ఈ రియాక్షన్‌ను precepitate చేయవచ్చు.

ఉబ్బిన మచ్చలు, బుడిపెలు అనేకం ఒక్కసారిగా వస్తాయి. చిన్నవిమరునాటికితగ్గి పెద్దవితగ్గటానికి వారంరోజులు పట్టవచ్చు. మచ్చలు ఎక్కువగా వున్నప్పుడు జర్వం మొదలయిన లక్షణాలు కనిపిస్తాయి.

అనుమానంగా వున్న కేసుల్లో skin Scraps నుండి లెప్రా క్రిములను గుర్తించటం ద్వారా గానీ, Lepramin test చేయటం ద్వారాగాని, నిర్ధారణ చేయవచ్చును.

**చికిత్స:** 1943లో (Sulphon) మందులు కనిపెట్టబడినతరువాత కుష్టువ్యాధిచికిత్స చాలా అభివృద్ధిఅయింది. కాని ఇప్పటికి కుష్టువ్యాధిని Control చేయటమేగాని cure చేయగలదశకు చేరుకోలేదు మరిన్ని కొత్తమందులు కనిపెట్టవలసిన అవసరంవుంది. దురదృష్టవశాత్తు ప్రస్తుత వాడుకలోవున్న మందులు చాలా మనదేశంలో సరిగా దొరకటంలేదు. మన

దేశంలో ఎక్కువగా వాడే (Dapson) అనే మందు కూడా ఈమధ్యమార్కెట్టునుండి మాయమయింది. ప్రస్తుతం(26-1-76) కుష్టుజబ్బుకు వుపయోగించే మందులేవీ విజయవాడలో అసలు దొరకడంలేదు (మిగిలిన పట్టణాలలో పరిస్థితికూడా ఇదేకావచ్చు. ఇన్ని సం॥ స్వాతంత్ర్యం తరువాత ఎమర్జన్సీలో వున్న మనదేశంలో పరిస్థితి ఇది. వీలయినంతమందిని అడుక్కు తినమని బజార్లలోకి తోలుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని గూర్చి ప్రజాప్రభుత్వం తీసుకుంటున్న బాధ్యతకు, శ్రద్ధకు ఇది మచ్చుతునక. సోషలిస్టు దేశాలలో ఉచితవైద్య సదుపాయాలతోపాటు అనారోగ్య కాలంలో తిండితిప్పలుకూడా ప్రభుత్వాలే చూస్తూవుంటే, కుష్టురోగులకు ప్రత్యేకమైన (Homes) నిర్మించి, వైద్యంతోపాటు అన్ని సౌకర్యాలు చూస్తూ వారి పిల్లల పోషణకూడా సోషలిస్టు ప్రభుత్వాలు నిర్వహిస్తూ వుంటే-మనదేశంలో కొనుక్కుందామంటే మందులు దొరక్క పోవటం. ఇది ఎలాటి సోషలిజమో ?

మం దు లు :

**Dapson :** కుష్టువ్యాధికి ఎక్కువగావాడే మందు. చౌక కూడా. ఈమందు రోజుకు వొకమాత్ర (100 mg) చొ॥న వాడాలి. కొంతమందికి ఈమందు సరిగా పడకపోవచ్చును. అలాటివారు రోజుకు 25 mgతో ప్రారంభించి క్రమంగా మోతాదు పెంచవచ్చును. చాలా అరుదుగా రక్తం తక్కువవటం, లివరు దెబ్బతినటం, మానసికమైన మార్పులురావటం జరుగుతుంది. అలాటప్పుడు మానివేయాలి

**Diason :** ఇది కూడా Sulpon గ్రూపుకు చెందిన మందే. ఇది ఉదయం ఒకమాత్ర (300 mg) రాత్రి ఒకమాత్ర వాడవచ్చు. మొదట్లో $\frac{1}{4}$ మాత్రతో ప్రారంభించి పక్షానికొక సారి $\frac{1}{4}$ మాత్ర చొ॥న మోతాదు పెంచుకుంటూ రావాలి.

**D. D. S. O. (Diaminocti phenyl sulphoxide)** ఇదికూడా dapson లాటి మందే. దానిలాగే రోజుకు 100mg చొ॥న వాడితే సరిపోతుంది.

ఇవన్నీ మాత్రలరూపంలో వాడే Sulphon మందులు. ఇంజక్షన్లరూపంలోవాడే మందులుకూడా వున్నాయి.

**Avlosulphon Soluble :** (0.25ml (50mg) వారానికి రెండుసార్లు చొ॥న ఇవ్వటంతో ప్రారంభించి 2-3 ml వరకు పెంచవచ్చును

**Sulpharone (Solatron)** ఇదికూడా వారానికి రెండు సార్లు 5mlతో ప్రారంభించి 3ml వరకు పెంచవచ్చును.

Sulfone గ్రూపుకుచెందని ఇతరమందులు.

**Thiamintosive :-** ఇది రోజుకు వొక మాత్రను ప్రారంభించి (500ml) రోజుకు నాలుగుమాత్రలవరకు వాడవచ్చును Dapsone పడనివారికి ఈమందు ఎక్కువ వుపయోగం Dapsoneతోపాటు ఇదికూడ వాడవచ్చును.

**Uadrin :** ఇది రోజుకు వొక మాత్రతో ప్రారంభించి 4మాత్రలవరకూ పెంచవచ్చును. Dapsone తోపాటు వాడవచ్చును.

**Reactions** వచ్చినప్పుడు వాడుతున్న మందులు ఆపివేసి **Cartisone** వాడవలసివుంటుంది.

కాళ్ళకు స్పర్శలేకుండా పోయినప్పుడు బూటువాడటం దెబ్బలు తగలకుండా జాగ్రత్తపడటం చేయాలి చేతులకు స్పర్శపోయినప్పుడు నిప్పుజోలికి, వేడివస్తువుల జోలికి పోకుండా వుండటం పోక తప్పనిపరిస్థితుల్లో gloves వాడటం అవసరం. కాళ్ళకు పుళ్ళుపడినప్పుడు కట్లుకట్టడం, విశ్రాంతి తీసుకోవడంద్వారా తగ్గించవచ్చును.

# మైలేజి

శ్రీ డి. రామిరెడ్డి, బి ఏ, బి. యిడి,

డి. ఏ. మెర్జ్‌డ్ స్కేళ్ళు వచ్చిన తర్వాత గ్రేడులవిభజన ఎలా చెయ్యాలో డిశంబరు 75 సంచికలో చివరయిచ్చాము. దానినిబట్టి రివైజ్ చేసిన గ్రేడులను నిర్ణయించుకోవాలి.

ఇప్పుడు మైలేజిని గురించి తెలుసుకొందాం. ప్రయాణంలో అయ్యే వివిధ ఖర్చులు భరించుటకు దూరమునుబట్టి నిర్ణయించి యిచ్చు అలవెన్సును మైలేజి అంటారు. మనం పని చేస్తున్న లేక మకాం చేసిన స్థలంనుండి చేరాల్సిన కేంద్రాలకు అనేక మార్గాలుంటే వాటిల్లో అతి తక్కువ దూరము గల మార్గమును మాత్రమే అనుమతిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో అన్యవిధమైన మార్గాన్నికూడా పై అధికారులు అనుమతింపవచ్చు. ఈరోడ్డు మైలేజి రైలుమార్గముతో కలుపబడినపుడు ... లేనపుడు ... కొంత కలుపబడి కొంత యితరమార్గములున్నపుడు వేరువేరుగా ఉంటుంది.

1 ఒకదినము అనగా 24 గం. ల కాలంలో 32 కి. మీటర్లకు మించినపుడు మాత్రమే రోడ్డుమైలేజి ఇస్తారు.

2 16 కి.మీ.కు మించిన దూరము యన్ జి ఓ లు, నాల్గవతరగతి ఉద్యోగులు ప్రయాణంచేసే వాస్తవ బస్‌ఛార్జీలు $+\frac{1}{4}$ డి.ఎ ను కోరవచ్చును. నాల్గవతరగతివారుగాక మిగిలిన యన్ జి ఓ. లు 32 కి మీ. లకు మించి (రానుపోను అయినా సరే) ప్రయాణంచేసినప్పుడు 24(ఎ)నిబంధనప్రకారం $\frac{1}{2}$ మైలేజి గాని, 27వ రూలుప్రకారం పైజెప్పిన డి ఎ గాని కోరవచ్చును.

3 దూరము 16 కి.మీ. కు మించనచో యన్ జి.ఓలు, నాల్గవతరగతి ఉద్యోగులు కేవలం బస్సుఛార్జీలు మాత్రమే పొందుటకర్హులు. అయితే బస్సుప్రయాణంలో కాలినడక, బండి మున్నగు ప్రయాణములు కలిసి 16 కి. మీ. మించినచో బస్సుఛార్జితోపాటు $\frac{1}{4}$ డి.ఏ రు 1-25 పైసలకు తగ్గకుండా పొందవచ్చును.

4 బస్సు లేక కాలువ మార్గము లేనిచోట్ల ఇతర వాహనములు బాడుగకు తీసుకొని ప్రయాణము చేసినచో 32 కి. మీ, లోపు దూరమునకు బాడుగ ఖర్చులు పొందనర్హులు.

5. రైలు మార్గములో కలుపబడని ప్రాంతములలో బస్సులలో ప్రయాణం చేసినపుడు 1 నుండి 4 తరగతులవారు 1 మైలేజి, 5 నుండి 7 తరగతులవారు $\frac{1}{2}$ మైలేజి లేక బస్ చార్జీలలో ఏది ఎక్కువైతే అదిగాని, 8, 9 తరగతులవారు $\frac{1}{2}$ మైలేజి, (ఎక్కువైనచో బస్‌చార్జీ)తో పాటు అదనంగా ఒకపైన చొప్పున మైలేజి పొందవచ్చును. [సశేషం]

# నిర్బంధ రిటైర్‌మెంట్ ఉత్తర్వు రద్దు చేయాలి

## రాష్ట్ర యు. టి. యఫ్. జనరల్ కౌన్సిల్ విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం 76 జనవరి 10,11 తేదీలలో విజయవాడలో శ్రీ కె నారాయణరావుగారి అధ్యక్షతన రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వందమంది పైగా పాల్గొన్న ప్రతినిధులతో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. దానిలో ఉపాధ్యాయులందరినీ ఆందోళన పెడుతున్న నిర్బంధ రిటైర్‌మెంట్ అమలును ఉద్విగ్న మనస్కతతో చర్చించి 'నిర్బంధ రిటైర్‌మెంట్ ద్వారా అనేకమంది నిరపరాధులు అధికారుల కఠిన చర్యలకు బలి అవుతున్నారనీ, కనీసం వారికి ముఖ్యమంత్రి గవర్నర్‌గార్లకు అపీలు చేసుకొనే అవకాశం కల్గించాలనీ. విద్యా సంస్థలలో ప్రశాంత పరిస్థితుల కొరకు ఆ నిర్బంధ రిటైర్‌మెంట్ ఉత్తర్వు రద్దుచేయాలనీ' విజ్ఞప్తిచేస్తూ ఒక తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

### శ్ర ద్ధాం జ లి

జాతీయగీతం గానం చేసిన తర్వాత శ్రీ జి లక్ష్మయ్య (రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు) గారు 'ఇటీవల అకస్మాత్తుగా మరణించిన కామరాజ్, రేలంగి, చక్రపాణి, చౌ-ఎన్-లై, లకు శ్రద్ధాంజలి ఘటిస్తూ సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. సభ్యులు నిలబడి మౌనంపాటించి తమ సంతాప సానుభూతుల్ని వెల్లడించారు.

శ్రీ కె నారాయణరావు అధ్యక్షోపన్యాసమిస్తూ విద్యా విధానంలోని లోపాలు ... వాటి నివారణోపాయాలు .... సమ సమాజ నిర్మాణానికవసరమైన విద్యావిధాన ఆవశ్యకత వివరించారు. ( అధ్యక్షోపన్యాస సంగ్రహ పాఠం ప్రత్యేకంగా ఇస్తున్నాం.)

పిదప శ్రీ ఎ. వెంకటుస్వామి (ప్రధాన కార్యదర్శి) గత 5 మాసాల సంఘ కార్యకలాపాల నివేదిక శ్రీ టి. కొండాచారి ( నెల్లూరుజిల్లా ప్రధాన కార్యదర్శి ) ఆర్థిక నివేదికలు సభకు సమర్పించారు. శ్రీ ఎం, వెంకటురత్నం (ప్రధానసంపాదకులు) - ఐక్య ఉపాధ్యాయ నివేదిక ప్రవేశపెట్టారు. ( పై నివేదికల పాఠాలు ప్రత్యేకంగా ఇస్తున్నాం.)

తరువాత. వివిధ జిల్లాల రిపోర్టులు శ్రీయుతులు జి. శ్రీరామమూర్తి (తూ॥గో) యస్. ఆర్. పోలిసెట్టి ( ప. గో ) యం. ఏసురత్నం (కృష్ణా) టి అంజిరెడ్డి ( గుంటూరు ) డి. రామిరెడ్డి (ప్రకాశం) ఎం. పోతురాజు (నెల్లూరు) డి. అబ్దుల్ అజీజ్ (కర్నూలు) వి. మల్లిఖార్జునరావు (ఖమ్మం) డి. కొమరయ్య (వరంగల్) పి కృష్ణమూర్తి (నల్గొండ) కె. రామిరెడ్డి (మహబూబ్‌నగర్) యం. నరహరి (హైదరాబాద్) పి. బి. ముత్తారావు (విశాఖ)గార్లు వ్రాతమూలకంగా ప్రవేశపెట్టారు. శ్రీ పి. అమరేశ్వరరావు, శ్రీ పి. రామిరెడ్డిగార్లు నిజామాబాద్, చిత్తూరు ఉద్యమ రిపోర్టులిచ్చారు.

. తదుపరి నివేదికలపై చర్చలు జరిగాయి. దానిలో 30 మందికిపైగా అత్యుత్సాహంతో పాల్గొని ఉద్యమాభివృద్ధికి పత్రికానిర్వహణకు తమతమ అనుభవాలతో జోడించి తగు సూచనలిచ్చారు. అనంతరం ఆ నివేదికలు ఏకగ్రీవంగా ఆమోదింపబడటంతో మొదటిరోజు కార్యక్రమం ముగిసింది.

రెండోరోజు ఉదయం శ్రీ ఆర్. రాఘవయ్య (రాష్ట్ర సంఘ కార్యదర్శి) ఉద్యమరిపోర్టు శ్రీ జి. లక్ష్మయ్య (రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు) జనరల్‌ఫండు రిపోర్టు శ్రీ కె. తిరిపాలు (రాష్ట్రసంఘ కార్యదర్శి) నిర్మాణరిపోర్టు శ్రీ యం. వెంకటురత్నం పత్రిక జనరల్ కేంపెయిన్ రిపోర్టులు ప్రవేశపెట్టారు.

### కేంపెయిన్ల పొడిగింపు

ఆ రిపోర్టులపై మొత్తం నలభైమంది చర్చలలో పాల్గొన్నారు. సభ్యత్వం, జనరల్‌ఫండు, పత్రికా కేంపెయిన్‌లు ఫిబ్రవరి నెలాఖరువరకు పొడిగించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోబడింది.

మధ్యాహ్నం గోష్ఠి కార్యక్రమం నిర్వహింపబడింది. శ్రీ డి. రామిరెడ్డి (కార్యదర్శి) నిర్బంధ రిటైరమెంట్, నేటివిటీ ఉత్తర్వు, యం. యల్. సి ఎన్నికలు, భవిష్యత్ కార్యక్రమాలగురించి గోష్ఠి నివేదికలు ప్రవేశపెట్టారు.

శ్రీ కె. గంగిశెట్టి (తూ. గో. ముమ్మిడివరం సమితి అధ్యక్షులు) గోష్ఠి ప్రారంభిస్తూ ఉద్వేగపూరితస్వరంతో తానిటీవల అధికారుల కక్షాచర్యగా నిర్బంధరిటైర్‌మెంట్‌కు ఎలాగురయిందీ, మేక తోడేలుకధలా తనపై ఎలా చర్య తీసుకొన్నదీ వివరించి తన గత జీవితమంతా ఉద్యమానికే అంకితం చేశాననీ ఈ ఉడతఊపులకు జడిసేదిలేదనీ, ఇంకా దృఢంగా ఆత్మవిశ్వాసంతో ఉద్యమాభివృద్ధికి కృషిచేయగలననీ చెప్పి అందరూ చెన్నుపాటి మహత్వపూర్ణ జీవితం ఆదర్శంగా ఆశయసాధనకు కృషిచేయాలని ఉత్తేజకరంగా ఉద్బోధించారు. (శ్రీ కె. కర్రెన్న (జిల్లాసంఘ కార్యదర్శి కర్నూలు) పశ్చిమ రాయలసీమ యం. యల్. సి ఎన్నికలవాతావరణాన్ని వివరించారు. శ్రీ పి అమరేశ్వరరావు (నిజామాబాద్) తమ జిల్లాలో ఇప్పటికే 82మంది టీచర్లు నిర్బంధ రిటైర్‌మెంట్‌కు బలి అయ్యారని వెల్లడించారు. అలానే శ్రీయుతులు పి. బి ముత్తారావు, టి. అంజిరెడ్డి, కె. బ్రహ్మాజీరావు, ఎ. సత్యనారాయణరాజు, యన్. రామకృష్ణరాజు, కె. నారాయణమూర్తి, వి. శ్రీరామమూర్తి, యం; కోటయ్య, పి. వి. సుబ్బరాజు, టి. బాలకృష్ణమూర్తి తదితరులు తమతమ జిల్లాలలో ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని వివరించి సమస్యల తీవ్రతను సభముందు పెట్టారు.

చివరికి అన్ని సంఘాలలో సమన్వయ కృషి ద్వారా నిర్బంధ రిటైర్‌మెంటు, నేటివిటీ ఉత్తర్వుల రద్దుకు కృషి చేయాలనీ, దానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలనీ, ఫిబ్రవరి నెలాఖరులోగా రాష్ట్రవ్యాపితంగా సమస్యలు సేకరించి ప్రభుత్వంతో రాయబారాలు సాగించాలని నిర్ణయాలు తీసుకొన్నారు.

పిదప శ్రీ యం. నరహరి (రాష్ట్రసంఘ కార్యదర్శి) తీర్మానాలు ప్రవేశపెట్టగా చర్చానంతరం అవి ఏకగ్రీవంగా ఆమోదించబడినాయి. (తీర్మానాలవివరాలు విడిగా ఇస్తున్నాం)

మొత్తంమీద కౌన్సిల్ ఇదివరకు జరిగిన అన్ని కౌన్సిళ్ళ కంటె ఎక్కువ చైతన్య పూరితంగా జరిగిందనీ, అది యిచ్చిన ఉత్సాహం ఉద్యమంలో కొత్త జీవం తేగలదనీ, గుండెలనిండా ఆత్మ విశ్వాసం నింపుకొని కార్యకర్తలు తమతమ ప్రాంతాలకు తిరిగి వెళ్ళారు.

## జనరల్ కౌన్సిల్ లో

## అధ్యక్షోపన్యాసం (సంగ్రహ సారం)

ప్రియమైన సహచర కార్యకర్తలారా!

ఆంధ్రప్రదేశ్ నలుమూలలనుండీ వచ్చిన మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు నా స్వాగతం చెపుతున్నాను. రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పునాదులు పడిన రాజమండ్రి మహాసభ తర్వాత ప్రముఖ చరిత్రాత్మక ఘటన అయిన ఖాజీపేటసదస్సు జరిగి నేటికి ఒక సంవత్సరం నిండింది. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ లోకంలో ప్రాంతీయ, వర్గ, కేటగిరీ భేదాల్ని అంతంజేసి అందరినీ ఒకే వేదిక మీదికి తెచ్చిన ఐక్యోద్యమ రథసారథులైన మీ అందరికీ నా హార్ది కాభి వందనాలను తెలియజేస్తున్నాను.

## విద్యారంగంలో తీవ్ర సంక్షోభం

దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సందర్భంలో మన మిక్కడ సమావేశ మౌతున్నాం. ప్రపంచ జనాభా 24 వందల మిలియన్లలోను 8 వందల మిలియన్లు నిరక్షరాస్యులు. అందులో సగంమంది భారతదేశంలోనే ఉన్నారు. అందునా ఆంధ్రప్రదేశ్ అక్షరాస్యతలో వెనుకబడి ఉంది.

| | భారతదేశం | ఆంధ్రప్రదేశ్ |
|---|---|---|
| మొత్తం అక్షరాస్యత శాతం | 29 45 | 24 57 |
| పురుషులలో శాతం | 39 45 | 33 18 |
| స్త్రీలలో శాతం | 18 70 | 15 75 |

ఈ వివరాలను బట్టి విద్యారంగంలో మన రాష్ట్రస్థాయి విశద మౌతున్నది. మొత్తంమీద నిరక్షరాస్యతా నిర్మూలనలో మనం ఘోర వైఫల్యాన్ని పొందేం. దాన్ని అలా ఉపేక్షిస్తే అది దోపిడీ శక్తులకు మూలాధారమై సాంఘికాభ్యుదయానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. అధిక సంఖ్యలో ప్రాథమిక సెకండరీ పాఠశాలల్ని, వయోజన విద్యా కేంద్రాల్ని స్థాపించటమే దానికి ప్రధాన పరిష్కారమార్గం. వేలాదిమంది శిక్షణపొందిన ఉపాధ్యాయులు నిరుద్యోగులుగానున్నసందర్భంలోనే నిరక్షరాస్యతా నిర్మూలన నత్తనడకతో సాగటం మనం ఎదుర్కొంటున్న విచిత్ర విచారకర పరిస్థితి.

ఉచితవిద్య అంటే ఫీజులు రద్దుచేయటమేకాదు. బిడ్డల సంపూర్ణ అవసరాల్నితీర్చి తలిదండ్రుల భారాన్ని తొలగించి విద్యాభ్యాసానికి ఆకర్షించటం జరగాలి. భారత వయోజన విద్యాసంస్థ అధ్యక్షుల మాటలప్రకారం భారత స్వాతంత్ర్యానంతరం వయోజనవిద్యకొరకు మొత్తం ఖర్చుపెట్టింది కేవలం 25 కోట్లు మాత్రమే. అంటే తలఒక్కింటికి 2, 3 పైసలు మాత్రమన్నమాట. విద్యారంగంలో అత్యంతకీలకమైన ప్రాథమిక విద్యారంగం, ఉత్పాదనకృషిలో నైపుణ్యాన్నేగాని వృద్ధిచేయ వలసిన వయోజన విద్యాపథకాలు ఈవిధంగా నిర్లక్ష్యంచేయబడ్డాయి. ఈపరిస్థితి మారాలంటె జాతీయాదాయంలో కనీసం 6 శాతం, కేంద్రబడ్జెట్‌లో 10 శాతం విద్యాపద్దుకు కేటాయించాలి: వీలయినంత వేగంగా క్యూబా, వియత్నాంలాంటి సోషలిస్టుదేశాల మాదిరిగా భారతదేశంలో నిరక్షరాస్యత నిర్మూలింపబడాలి. అపుడే జాతిజీవనరంగంలో విద్యారంగం ప్రముఖపాత్ర వహిస్తుంది.

## పంచాయత్ రాజ్‌నుండి విద్యను వేరుచేయాలి

మన గవర్నర్‌గారన్నట్లు 'సరయిన విద్యావిధానానికి పంచాయత్‌రాజ్ నుండి విద్యాసంస్థల్ని తొలగించాలి. అన్నిరకాల మేనేజిమెంటుల్ని రద్దుచేయాలి.' ప్రభుత్వ, ఉపాధ్యాయ, తలిదండ్రుల ప్రతినిధులతో గూడిన స్వయంపాలిత విద్యాబోర్డుల్ని నెలకొల్పి విద్యారంగాన్ని వాటిక్రిందికితెచ్చి ప్రజాతంత్ర పద్ధతుల్లో వాటిని నిర్వహించాలి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో 'ఎటానమస్ బోర్డుఆఫ్ ఎడ్యుకేషన్' అనే సంస్థ అమలులోకి వచ్చింది. అస్సాంరాష్ట్రంలో పంచాయతీరాజ్ నుండి విద్యను వేరుచేయటం జరిగింది.

## సిలబస్

నేడు వలస ప్రభుత్వావశేషమైన విద్యా విధానమే కొన్ని పైపై మెరుగులతో అమలులో ఉన్నది. మనం నిర్ణయించుకొన్న సోషలిస్టు సమాజానికవసరమైన శాస్త్రీయ సాంకేతిక విద్యా విధానానికి అనుగుణంగా సిలబస్‌లో మార్పులు రావాలి. సిలబస్ తయారు చేయటంలో పని-అనుభవం తప్పనిసరిగా జోడింపబడాలి. అది సామాజికాభివృద్ధికి చెందిన ఆశయాలకు అనుగుణంగా రూపొందింపబడాలి. అందు ఉపాధ్యాయుని పాత్ర యెడ ఏమాత్రం ఉదాసీనత పనికిరాదు. అసలే అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థలో మాటిమాటికీ మారే విద్యా సంస్కరణలు తలనొప్పి కలిగిస్తున్నాయి. నాన్ డిటెన్షన్ స్కీముతో పాటు విద్యారంగంలో తగిన భౌతిక పరిస్థితుల్ని సృష్టించటంలో విఫలమైనందున ఆ స్కీము యొక్క ఆశయమే చెడింది అదే వైఫల్యం నూతన మూల్యాంకన పద్ధతి నెదుర్కొంటున్నది.

## నిరుద్యోగం

నేడు దేశంలో నిరుద్యోగుల సంఖ్య హనుమంతుని వాలంలా పెరుగుతున్నది 75 నవంబరు చివరివరకు ఎంప్లాయిమెంటు కేంద్రాలలో దేశమంతటా నమోదైన వారి సంఖ్య 90 లక్షల్ని దాటింది. మన రాష్ట్రంలో 6 లక్షల 9 వేలు మించింది. మాజీరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరిగారి లెక్కలప్రకారం దేశంలో 10 కోట్లమంది నిరుద్యోగులున్నారు. చదువుకొన్న వాడికి, పనిచేస్తానన్న వాడికి పనిదొరకనప్పుడు జాతీయ సంపద, ఉత్పత్తి పెరుగుదల సాధ్యంగాదు రాజ్యాంగంలో పనిహక్కును పొందుపరిచి, నిరుద్యోగభృతినికల్పిస్తూ నిరుద్యోగ నివారణకు తగుపథకాలు ఆచరణలో పెట్టాలి. విద్యపట్ల సమాజంలో తగు ఆసక్తి కల్పించాలి.

## జాతీయ వేతన విధానం

ఉపాధ్యాయుని జీవన పరిస్థితి బాగుపడనిదే విద్యారంగంలో అభివృద్ధినూహించలేము. చాలీచాలని జీతాలతో, దినదినమూ పెరుగుతున్న ధరలతో, కోల్పోతున్న రూపాయి విలువతో అధ్యాపకుని స్థితి దిగనాసిగా మారుతున్నది. కొఠారి కమీషన్ సూచించిన స్కేళ్ళు అందకుండానే పోయాయి ఉన్న స్కేళ్ళయినా ఏ శాస్త్రీయ ప్రాతిపదికలేనివి. అర్హతను బట్టి వేతనమన్న సూచన కాగితాల్లోనే ఉండిపోయింది పెరుగుతున్న ధరలకనుగుణంగా కేంద్రోద్యోగులకువలె డి.ఎ. పెరగటం జరగలేదు. నేటికీ మూడుదశల వెనుకబడేవున్నాము. ఆ యిబ్బందికూడా ఒక సంవత్సరం ఆలస్యంగా ఇచ్చినందున కోట్లాది రూపాయలు ఉద్యోగులు నష్టపోయారు. శాస్త్రీయ పద్ధతిలో ప్రజ్ఞావంతుల్ని ఆకర్షించేవిధంగా జాతీయవేతన విధానాన్ని రూపొందించాలి. 50లక్షల పథకంకింద నియమింపబడ్డ టీచర్లకు, సర్వీసులో ప్రమోషన్‌కొరకు ఎదురుచూస్తున్న టీచర్లకు తగినన్ని పోస్టులు సృష్టించాలితప్ప ఒకరికొకరిని పోటీపెట్టేవిధానంవల్ల విద్యా సంక్షేమంసాగదు మళ్ళీ ఇప్పుడు పులిమీద పుట్రలా నిర్బంధ రిటైర్‌మెంట్ ఉత్తర్వు టీచర్లలో భయాందోళన కలిగిస్తున్నది.

## కర్తవ్యం

పరిస్థితులు ఇలా ఉన్నా మనం నిరాశా నిస్పృహలకు లోనుకావటం మంచిది కాదు. ఈ దేశం ఈ జాతి మనదనే దృష్టితో, దేశమందలి సకల భౌతిక వనరుల్ని మానవ కళ్యాణానికి వినియోగించే నూతన పౌరుల్ని, అట్టి సమాజాన్ని తయారుచేసే కర్తవ్యాన్ని మనం నిర్వహించాలి. ప్రత్యామ్నాయ శాస్త్రీయ విద్యా విధానాన్ని ప్రజల దృష్టికి తెస్తూ, ఆ యా సమస్యల యెడ ఉపాధ్యాయుల్ని చైతన్యపరుస్తూ, సుదీర్ఘ కాలంగా మనం కలలు గంటున్న ప్రజాతంత్ర చైతన్యాన్ని, సంస్కృతిని ప్రబోధించటం మన తక్షణ కర్తవ్యం. అప్పుడే మనం మన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించినవారమౌతాం.

# జనరల్ కౌన్సిల్‌లో - కార్యదర్శి నివేదిక

(సంగ్రహ పాఠం)

## (4-8-75 నుండి 31-12-75 వరకు)

అధ్యక్షా! కామ్రేడ్స్!

మీ అందరికీ స్వాగతం!

1975 ఆగస్టు 9,10 తేదీలలో 2వ నూతన జనరల్ కౌన్సిల్ జరుపుకొని మళ్ళీ ఐదుమాసాల తర్వాత సమావేశమౌతున్నాం. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రాథమిక, సెకండరీ, జూనియర్ కాలేజీలవరకు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు వ్యాప్తినొంది ...యీ కాలంలో విశాల సమైక్య ఉద్యమానికి స్థిరమైన పునాదులు పడ్డాయి. సంఘం ఏర్పడిన కొద్దికాలంలోనే తన కార్యక్రమాల ద్వారా, పత్రికా నిర్వహణ ద్వారా ఉపాధ్యాయుల పక్షాన నిలిచి పనిచేసే పోరాట సంస్థగా గుర్తింపు పొందింది. (1) వేతనస్తంభన చట్టానికి వ్యతిరేకంగా కార్యక్రమం చేపట్టుటం (2) ఉపాధ్యాయుల 13 కోర్కెలతో 10వేల సంతకాలతో శాసనసభలకు విజ్ఞప్తి పత్రాలు సమర్పించటం (3) పే కమీషనర్‌కు శాస్త్రీయ దృక్పథంతో తగు సూచనలు చేసి జి ఓ వెలువడిన వెంటనే దానిలోని లోపాల్ని వెల్లడిచేసి సవరణల్ని సూచించటం (4) 10 కోర్కెలతో 15 వేల సంతకాలతో కార్డ్స్ కేంపెయిన్ దిగ్విజయం చేయటం (5) ఉపాధ్యాయుల్ని పీడిస్తున్న 45 సమస్యల పరిష్కారానికి రాష్ట్ర విద్యాశాఖాధికారులకు మెమొరాండాలిచ్చి వాటి పరిష్కారానికి కృషిచేయటం (6) నేటి టీ ఉత్తర్వు రద్దుచేయాలనీ, నిర్బంధ రిటైర్‌మెంట్ ఉత్తర్వు నిలుపుదల చేయాలని తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపటమే గాకుండా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు, యమ్.యల్.సి లకు లెటర్లు పెట్టి, స్వయంగా కలిసి సమైక్య ఉద్యమ నిర్మాణానికి కృషిచేయటం (7) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మేనేజిమెంట్లలోనూ కో ఆర్డినేషన్ సమావేశాలు జరిపే దానికి లెటర్లు పెట్టి అవి జరిగేలా చూడటం మొదలగు కార్యక్రమాలు చేపట్టి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తన పేరు సార్థకపడేలా కృషిచేసి తన ప్రత్యేకత నిలుపుకొంది.

చారిత్రాత్మక కార్డ్స్ కాంపెయిన్ ఉపాధ్యాయ సమస్యలు సంవత్సరాలతరబడి పరిష్కారంగాక, కనీసం సాటి ఉద్యోగులుపొందే సౌకర్యాలులేకున్న దుస్థితిలో మనం కార్డ్స్ కేంపెయిన్ సాగించాం. తీర్మానాలు వినిపించక, ప్రకటనలు కనిపించక, రాయబారాలు విఫలమయ్యాక నేటిపరిస్థితిలో ఊరకఉండేకంటే ఉన్నమేరకు కదలాలని యు.టి.ఎఫ్. నిర్ణయించింది. కనీసకార్యక్రమంగా యీ క్రింది పదిసమస్యలతో కార్డ్స్ కేంపెయిన్ నిర్వహించింది. 1) డి ఏ. మెర్జెడ్ స్కేళ్ళు ఉపాధ్యాయ సంఘాల సూచనలతో వెంటనే విడుదలచేయాలి. 2) కేంద్రప్రభుత్వోద్యోగులతో సమానంగా తక్షణం కరువుభత్యం పెంచాలి 3) అన్ని కేడర్లలోను సెలక్షన్ గ్రేడ్ పోస్టులు సృష్టించాలి. 4) లిబరలైజ్‌డ్ పెన్షన్ పథకం 1969 నుండి అమలుపరచాలి. 5) కనీసపింఛను రు.45లు ఇవ్వాలి. 6) 1968 పూర్వపు బకాయీలు వెంటనే చెల్లించాలి. 7) ఏజన్సీ అలవెన్సు అందరు ఉపాధ్యాయులకు అమలుపరచాలి. 8) సరెండర్‌లీవు సౌకర్యం అందరి ఉపాధ్యాయులకు వర్తింపజేయాలి. 9) ఉపాధ్యాయుల బిడ్డలకు విద్యా అలవెన్సులు ఇవ్వాలి. 10) ఎడ్యుకేషన్ కన్సెషన్లకు ఆదాయపరిమితి పదివేలకు పెంచాలి.

నేటిపరిస్థితిలో తమ సమస్యలు పరిష్కరింపబడక అయోమయ పరిస్థితిలోవున్న ఉపాధ్యాయులను యీ కార్యక్రమం బాగా ఆకర్షించింది. వారంరోజుల్లో 15 వేలమంది సంతకాలు చేసి ముఖ్యమంత్రిగారికిపంపి ఈ కాంపెయిన్‌ను దిగ్విజయం చేశారు.

ఫలితాలు ;- ఆ తర్వాత (1) డి. ఎ. మెర్జ్‌డ్ స్కేళ్ళ జి. ఓ. విడుదలకావటం (2) కరువుభత్యం పెంపుదల జి. ఓ. వెలువడటం (3) పెన్షనర్లకు కొంతమేరకైనా అదనపుసాయం లభించటం (4) 1968 పూర్వపు ఎరియర్స్ 2 కోట్లలోను రు. 50లక్షలు విడుదలకావటం (5) ఏజన్సీఅలవెన్స్ ప్రభుత్వేతరోపాధ్యాయులకు అమలుజరిపేవిషయమై లెక్కలు పంప

పలసినదిగా ఆదేశాలు రావటం (6) సెలక్షన్ గ్రేడుపోస్టులు. 69నుండి లిబరలైజ్డ్ పెన్షన్, విద్యా అలవెన్సులు, ఆదాయ పరిమితి పదివేలకు పెంపుదల పరిశీలనకు తీసుకోవటం జరిగింది.

దీనితోనే అన్ని సమస్యలు పరిష్కరింపబడతాయని, పరిష్కరింపబడినవికూడా మనం కోరినవిధంగా ఉంటాయని మనం అనుకోలేదు. అన్ని సమస్యల పరిష్కారానికి అందరితో కూడిన ఐక్యకార్యాచరణ అవసరమని యు. టి. యఫ్. ధ్యేయం. అదృష్టితో కార్డ్సు కేంపెయిన్‌కు కలిసిరమ్మని సోదర ఉపాధ్యాయ సంఘాలన్నిటికి 18-9-75న లెటర్లుపెట్టి వెంటనే సమాధానం పంపించాలనికోరాం. కాని వారు కార్యక్రమంలో పాల్గొనలేదుసరిగదా...కనీసం జవాబు ఇచ్చేదానికికూడా ప్రయత్నించలేదు. అయినా తిరిగి మనం నిర్బంధరిటైర్ మెంట్ నేటివిటీ ఉత్తర్వుల రద్దుచేయించే ఐక్యకార్యాచరణకయి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలన్నిటికి, యం. యల్. సి. లందరికి 1-12-75 న లెటర్లు పెట్టడమే కాకుండా 4-12-75 న వారినందరిని స్వయంగా కలిసి పరిస్థితి వివరించాం. ఫలితం ఎలావుంటుందో వేచిచూడాల్సివుంది.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు : విజయవాడ, గుంటూరు పట్టణాలలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులకు 15 శాతం ఇంటి అద్దె యివ్వాలని, మిగిలిన అన్ని ప్రాంతాల ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఫేమిలీ బెనిఫిట్ స్కీము అమలు పర్చాలని, అన్ ఎయిడెడ్ పోస్టులకు గ్రాంటు రిలీజు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారికి విద్యాశాఖ డైరెక్టర్ గారికి 5-12-75 న ఉపాధ్యాయుల సంతకాలు గల విజ్ఞప్తి పత్రాలు సమర్పించటం జరిగింది.

కో ఆర్డినేషన్ సమావేశాలు : ప్రభుత్వ మెమో నెం. 1464 ప్రకారం ప్రతి జిల్లా, సమితి, పట్టణ మేనేజిమెంట్లు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు జరిపి సమస్యలు పరిష్కరింపవలసినదిగా ఆదేశించుట జరిగింది. దాని నాధారంగా తీసుకొని మన సంఘం మన ఉద్యమం గల అన్ని జిల్లాల కలెక్టర్లకు, జడ్. పి. శక్రటరీలకు, డి. యి. ఓ. లకు జిల్లా ఆఫీసు బేరర్ల అడ్రసులు తెలుపుతూ వెంటనే సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయవలసిందిగా లెటర్లు పెట్టటం జరిగింది. మన లెటరుపై ప్రకాశం జిల్లా కలెక్టరు జడ్. పి. శక్రటరీలు, నెల్లూరు, కృష్ణాజిల్లాల జడ్ పి శక్రటరీలు ప. గో. జిల్లా డి యి ఓ, కాకినాడ మునిసిపల్ కమీషనర్ వెంటనే చర్యలు తీసుకోవటం సంఘ ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయుటం జరిగింది.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఖమ్మం, వరంగల్ జిల్లా పరిషత్తులలో సమన్వయ సమావేశాలు జరిగేయి. వాటిల్లో జిల్లాశాఖ బాధ్యులు, రాష్ట్ర ఆఫీసు బేరర్లు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. అట్లే అనేక సమితి మునిసిపల్ మేనేజిమెంట్లలో కూడా సమన్వయ సమావేశాలు జరిగేయి అయితే ఇంకా ఆ సమావేశాలు జరగని జిల్లాలు, సమితులు, మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో కూడా వెంటనే జరిపించేదానికి మనం కృషిచేయాలి.

జరిగిన సమావేశాలలో కూడా సమస్యలు పరిష్కారం గాక తిరిగి ఆ సమస్యలే మరు సమావేశానికి చర్విత చరణం అవుతున్నాయి కాన ఆ సమావేశాల్ని మరింత ప్రయోజనకరంగా సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవలసి ఉంది.

రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గాల ఎన్నికలు: రాయలసీమ తూర్పు పశ్చిమ ఉపాధ్యాయ యమ్. యల్. సి. ల ఎన్నికలు 76 జూలైలో జరుగనున్నాయి అందుకు మనం ప్రాధమికసన్నాహాలు ప్రారంభించాం నెల్లూరు జిల్లాకౌన్సిల్‌కు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కె నారాయణరావు, శ్రీ డి. రామిరెడ్డి హాజరై కార్యక్రమం యిచ్చి వచ్చారు. మన ప్రయత్నంలో మనమున్నాం. కొందరు తమను బలపరచవలసిందిగా మనకు లెటర్లు పెట్టారు.

ముమ్మిడివరం సమితిలో కక్షాచర్యలు : అక్రమ బదిలీని రద్దుచేయటానికి తూ॥ గో॥ జిల్లా ముమ్మిడివరం సమితిలో 26-11-75 న ధర్నా నోటీసు యివ్వబడింది. పరిస్థితి గుర్తించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిల్లాకు వెళ్ళి సబ్ కమిటీతోను సమితి కార్యవర్గంతోను చర్చించి జిల్లాకలెక్టర్‌తో రాయభారం జరిపి వారి హామీ మేరకు ధర్నా విరమించటం జరిగింది. మనపై నిర్బంధాలకు చరిత్ర హీనులు కొందరు పండుగ జేసుకొంటున్నా ఉపాధ్యాయుల హృదయాలలో యు. టి యఫ్. హత్తుకొంది. అయితే సమితి మేనేజిమెంటు మాత్రం బరితెగించి సంఘ కార్యకర్తలపై కక్షా చర్యలకు పూనుకొంది. శ్రీ కె నరసింహమూర్తిపై ఛార్జిమెమో పెట్టటం, అమలాపురంతాలూకా ఉద్యమనిర్మాత, సీనియర్ కార్యకర్త శ్రీ కె. గంగిశెట్టిగారిని నిర్బంధ రిటైర్ మెంటుకు గురిచేయటం, మరి కొందరు కార్యకర్తలపై బెదిరింపులు సాగించటం, ఉపాధ్యాయుల్ని భయపెట్టటంజరుగుతున్నవి. కాని చైతన్యం, చేవగల కార్యకర్తలపై ఆ బెదిరింపులు పనిచేయవని ఈ పాటికే వారు గుర్తించిఉంటారు.

చెన్నుపాటి వర్ధంతి సభలు: అమరజీవి చెన్నుపాటి వర్ధంతిసభలు డిశంబరు 9నుండి 15 వరకు వారం రోజులు జరిపి ఆమహనీయునికి శ్రద్ధాంజలి ఘటించబడింది. రాష్ట్ర సంఘం పిలుపునందుకొని అనేకచోట్ల ఆ సభలు జరిగాయి.

రాయబారాలు : 1975 ఆగస్టు 5,6 తేదీలలో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి, విద్యాశాఖ అధికారులనుకలసి ఉపాధ్యాయుల 22 సమస్యలపైమెమోరాండం సమర్పించాము. పిదప సోషల్ వెల్‌ఫేర్ డైరెక్టరును కలసి సోషల్ వెల్ఫేర్ టీచర్ల సమస్యలపై మెమోరాండం ఇచ్చాము డైరెక్టర్ గారు నెం 18552 తేది 29-8-75లో అందరు జిల్లావెల్‌ఫేర్ ఆఫీసర్లను సదరు సమస్యలను పరిష్కరించవలసిందిగా ఆదేశించారు.

1-9-75న విద్యామంత్రికి టీచర్స్‌డే జెండాలు ఉపాధ్యాయులకు నిర్బంధంగా అంటుగట్టరాదని కోరుతూ విజ్ఞప్తి చేశాం. 2-9-75న సాటి ఉద్యోగులకు అమలుజరిపే సౌకర్యాలైనా ఉపాధ్యాయులకు టీచర్స్‌డే సందర్భంలో వర్తింపజేయుమని మహజరు ఇచ్చాం.

1975 డిశంబరు 4,5,6 తేదీలలో హైదరాబాదులో పంచాయతీరాజ్ శాఖామంత్రి, విద్యాశాఖ డైరెక్టరు, విద్యాశాఖ కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టరు, చైల్డ్ వెల్ఫేర్ గౌరవకార్యదర్శి మొదలగు వారినికలిసి ఉపాధ్యాయుల సమస్యలపై రాయబారాలు నడిపి

క్రిందిసంఘాలకు ప్రతినెలా సర్క్యులర్లు పెడుతున్నాం. వాటితోపాటు ముఖ్యమైన జి. ఓ. లు కూడా అందిస్తున్నాం. ఈమధ్యకాలంలో సర్క్యులర్లు 18 పంపేము.

మూడు కేంపియన్లు :- ఇది నిర్మాణకాలం. మనం గత సంవత్సరం 7 జిల్లాలకే పరిమితమైఉంటే ఇప్పుడు 14 జిల్లాలకు వ్యాపించాం. మరొక 7 జిల్లాలలో మనం నిర్మాణం పూర్తిచేయాల్సిఉంది. మనంచేపట్టిన నిర్మాణం పూర్తిచేసిననాడే సమస్యా పరిష్కారానికి ఉద్యమాల నిర్మాణానికి ఊతంఏర్పడు తుంది.

1. సభ్యత్వం: సభ్యత్వ కేంపెయిన్ ఇప్పుడు ముమ్మరంగా సాగుతూ ఉంది. దీన్ని మరింత తీవ్రపరచి కోటాల నధిగమించాలి మనం నిర్ణయించుకొన్న కోటా 17 వేలు. ఇప్పటికి చేరింది పదివేలు. ఫిబ్రవరి లోపల మిగిలింది పూర్తిచేయాలి. దానికి మొత్తం యంత్రాంగమంతా శక్తివంతంగా కదలవలసిన కాలమిది.

2. జనరల్ ఫండు: సభ్యత్వం ఒక్కదానితోనే సంఘాన్ని నడపటం సాధ్యంగాదు. అన్ని శాఖల ఆర్థిక యిబ్బందులు అధిగమించి కార్యకలాపాలు సాగించే దానికి 50 వేల జనరల్ ఫండు సేకరించాలని నిర్ణయించాం. ఆ విలువును ఇంతవరకు ఉపాధ్యాయులలోకి తీసుకు వెళ్ళిన జిల్లాలు చాల తక్కువ. ఈ విషయంలో ఒక్క ఖమ్మంజిల్లా మాత్రం ఆదర్శప్రాయంగా కదిలింది రాష్ట్రానికి నిర్ణయించిన కోటా పూర్తిగా చెల్లించింది. అందుకు వారికిధన్యవాదాలు ఫిబ్రవరిలోపల కదిలి కోటాపూర్తి చేసిననాడే అన్ని శాఖలు బాగా పనిచేయ గలుగుతాయి.

3. పత్రిక : స్పెషల్ కేంపెయిన్ జయప్రదంగా ముగించుకొని జనరల్ కేంపెయిన్ సాగిస్తున్నాం. అప్పుడే కొన్ని జిల్లాలు గణనీయ కృషిచేసి కోటాలు నధిగమించాయి.

## రాష్ట్రకార్యాలయ నిర్వహణ

రాష్ట్ర కార్యాలయంలో ఇద్దరు పూర్తికాలం కార్యకర్తలు పనిచేస్తున్నారు. పెరిగిన ఉద్యమాన్ని దృష్టిలోపెట్టు కొంటే కరస్పాండెన్సుకు న్యాయంకలిగించాలన్నా, పత్రికను సర్వాంగసుందరంగా తీసుకురావాలన్నా, జిల్లాల నిర్మాణం చూడాలన్నా మరోయిద్దరు హోల్ టైమర్స్ అవసరం. సంఘాధ్యక్షులు, ప్రధాన సంపాదకులు దానికి సిద్ధంగావాలి. పత్రిక అడ్రసులు, పోస్టింగుచూడటానికి పార్టుటైమ్ ఉద్యోగినికూడా నియమించాల్సివుంది. కార్యాలయానికి తెలుగు ఇంగ్లీషుటైప్ మిషను డూప్లికేటింగ్ మిషన్ నేడెంతైనా అవసరం. జిల్లాల వారీగా మన నిర్మాణం ఇలావుంది.

(1) శ్రీకాకుళం : కొత్త సంబంధాలు ఏర్పడ్డాయి. ఇకముందు నిర్మాణం చేయవలసిఉంది. (2) విశాఖ : గత నిర్మాణంకంటె కొంత పురోగమించింది. మరి కొన్ని సమితులలో నిర్మాణం జరిగింది. మునిసిపల్ సమస్యల మీద కృషి జరిగింది. (3) తూ. గో. : సభ్యత్వం 2800 లు చేర్పించారు. మరో 1200 చేర్పించటానికి కార్యక్రమంతీసుకొన్నారు. సర్క్యులర్లు సమావేశాల రెగ్యులర్ గాజరుగుతున్నాయి. పత్రికస్పెషల్


ఎ.వి.యస్. లాడ్జి
ఎటాచ్డ్ లెట్రిన్స్ & బాత్‌రూమ్స్
ఆధునికమైన అన్ని వసతులూ గల
విశ్రాంతి మందిరం.
స్టేషన్‌రోడ్, చీరాల, ప్రకాశంజిల్లా.

చెల్లారామ్స్ షో రూమ్
వెంకటేశ్వ దర్బార్ రోడ్, చీరాల.
మావద్ద అన్నిరకముల నైలెక్స్, సాదా ఎంబ్రాయిడరీ, ఫుల్ వాయిల్, అర్‌గండిచీరలు మరియు స్ట్రెచ్చి టెరిన్, టెరికాటన్, అన్ని రకాల కాటన్ వస్త్రాలు మిల్లువారు నిర్ణయించిన రేటుకు విక్రయింపబడును.
చెల్లారామ్, చీరాల.

మహాన్ వాచ్ హౌస్
గడియారం స్థంభం వద్ద, చీరాల.
ఆథరైజ్డ్ డీలర్స్ :- టెలిరాడ్ & బుష్ రేడియోలు
మా వద్ద అన్ని రకాల గడియారాలు
రేడియోలు దొరకును.
రిపేరింగు మా ప్రత్యేకత
ప్రొ :- సయ్యద్ మస్తాన్ సాహెబ్,
చీరాల, ప్రకాశం జిల్లా.

ఫోన్ : 25.
శ్రీ శ్రీనివాసా ట్రేడింగ్ కంపెనీ
గొల్లలమామిడాడ (తూ. గో. జిల్లా)
వాయిదాల పద్ధతిపై రేడియోలు, పంకాలు,
సైకిళ్ళు, స్టీలుఫర్నిచరు, గడియారములు.
లభించును.